


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

04.09.2026

శుక్రవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 114

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# రైతులకు సాయం

- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు ఫోకస్
- మామిడి రైతులకు రూ.281 కోట్ల సాయం
- పొగాకు రైతులకు రూ.94 కోట్ల ఆర్థిక సాయం
- ఈ ఏడాదిలోనే స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశం
- 100 మున్సిపాలిటీల్లో ఎన్నికలకు చర్యలు
- ఎల్‌నినో, కరువుపై కేబినెట్‌లో చర్చ
- తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- మంత్రులు ప్రజల్లోకి వెళ్లాలని సీఎం ఆదేశం
- నిత్యావసర ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి





**రైతులకు గుడ్ న్యూస్..**

తోతాపురి మామిడి రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు రూ.281 కోట్ల మద్దతు ధర నిధులు అందించాలని నిర్ణయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా స్వల్పకాలిక రుణాలు అందించేందుకు కూడా కేబినెట్ అనుమతి ఇచ్చింది. రైతులకు సంబంధించిన అన్ని అంశాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇక, పొగాకు రైతులకు రూ.94 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతులు, అమరావతి రాజధాని అభివృద్ధి, రహదారులు, రైల్వే లైన్, వరద నష్టం పునరుద్ధరణ, వైద్య, న్యాయ రంగాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 7లో..

**అమరావతి, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతులు, అమరావతి రాజధాని అభివృద్ధి, రహదారులు, రైల్వే లైన్, వరద నష్టం పునరుద్ధరణ, వైద్య, న్యాయ రంగాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అమరావతి మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన భూసమీకరణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి పార్థసారథి.. కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

# స్నేహంతోనే నన్ను గెలవాలి నేను ఎవరికీ గులామ్‌ను కాదు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్
- భారీ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం
- నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు..

7లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్**

తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

## మినహాయింపులు ఇస్తేనే డీల్!

- అమెరికాతో తుది ఒప్పందం
- కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్
- ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఇబ్బందులు

2లో..



## 2 ఏళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేత

- ముంబై నటి కాదంబరి జత్వానీ కేసు
- ఐపీఎస్‌లు కాంతిరాణా, విశాల్ గున్నీకు ఊరట
- సర్వీసుల్లోకి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు
- కేసుల విచారణపై ప్రభావం చూపదని వెల్లడి

2లో..

## అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు

- లోకల్ ఎన్నికలపై లోకేశ్ ఫోకస్
- అక్టోబర్ నుంచి అర్హులకు కొత్త పింఛన్లు
- దశలవారీగా పింఛన్లు ఇవ్వాలని సూచన
- అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు పూర్తి
- ఎన్నికల వాయిదాకు ఛాన్స్ లేదన్న లోకేశ్
- పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశం

2లో..



## 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో

- 100% కొనసాగుతుందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక
- భారత్‌పై ప్రభావం చూపించే అవకాశాలే ఎక్కువ



2లో..

## ప్రైవేట్ స్కూళ్లలో 25% ఉచిత ప్రవేశాలు

- ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- కొత్త నిబంధనలపై కసరత్తు
- 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ
- సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా..
- కొత్త నిబంధనలు రానున్నాయి

2లో..

**అమరావతి, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(c) ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు అమలవుతున్న ప్రస్తుత మార్గదర్శకాలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## స్వయంకృతాపరాధమే

### కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం: విప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్**



దేవాదాయశాఖ మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. ఆమె బర్తరఫ్ స్వయంకృతాపరాధమేనని అన్నారు. పార్టీ, ప్రభుత్వం కొండా సురేఖకు అనేక అవకాశాలు ఇచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. కొండా సురేఖ తన కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోలేకపోయారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేయడం ద్వారా పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేశారని అన్నారు. 2లో..

## కూతురు వ్యాఖ్యలే కారణం

- ఖర్గే వద్ద కూడా ఖండించలేదని వెల్లడి
- సమగ్ర విచారణ తర్వాతే నివేదిక: మల్లు రవి
- ఎంతటి పెద్దవారైనా నిబంధనలు పాటించాల్సిందే

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతున్న వేళ, తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఇచ్చిన ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలో సంచలన విషయాలు వెల్లడించారు.

## రాఘవ్ చడ్డాకు ఓటర్ లిస్ట్ షాక్

- ఇటీవల బీజేపీలో చేరిన ఆప్ నేత
- రాజకీయ కక్షతోనే ఓటు తొలగింపు: రాఘవ్ చడ్డా

7లో..



## నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

- రూ.35కే కిలో ఉల్లిపాయలు అందించేందుకు నిర్ణయం
- 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు
- 10 వేల మెట్రిక్ టన్నుల కేఎంఎం రకం బియ్యం సేకరణకు ఆదేశం
- సామాన్యులపై ధరల భారం పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి – మంత్రివర్గ ఉపసంఘం

2లో..



**అమరావతి, సెప్టెంబర్ 3: అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే అమలు చేస్తున్న బియ్యం మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమానికి అదనంగా ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్‌పై తక్షణమే మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.



# మినహాయింపులు ఇస్తేనే డీల్!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు సుంకాల విషయంలో మినహాయింపులకు అమెరికా అంగీకరించిన తర్వాతే ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. ''న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో అమలులోకి వస్తుంది.. ఆ తర్వాత 27 దేశాల కూటమి అయిన ఈయూతో అమలులోకి వస్తుంది.పోటీ దేశాలతో పోలిస్తే అమెరికా మనకు ప్రాధాన్యతా రేటును ఇచ్చేందుకు సిద్ధమైన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం'' అని పీయూష్‌గోయల్ అన్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. 'లేవరేజింగ్ ఎఫ్‌టీఏల ఆట్‌రీచ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే కొద్ది నెలల్లో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, SACU (దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్), GCC (గల్ఫ్ సహకార మండలి), ఇజ్రాయెల్ సహా ఇతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTAలు), అలాగే ఆసియా, కొరియా, జపాన్ వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రయత్నాలు, భారత్‌కు ఇతర పోటీదారుల కంటే తక్కువ రేటుకే ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను అందిస్తాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పటికే యూకే, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు.

భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం చర్చల దశలో ఉంది. ఇరు దేశాలు మార్కెట్ విస్తరణ, వాణిజ్య అడ్డంకులను తొలగించడం, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ముసాయిదా ఒప్పందం ఇప్పటికే పూర్తయిందని, మరో మూడు నుంచి నాలుగు నెలల్లో దీనిపై సంతకాలు చేసే అవకాశం ఉందని ఒక సీనియర్ అమెరికా అధికారి జులైలో తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అమెరికా 'సెక్షన్ 301' వాణిజ్య విచారణలు మాత్రమే ఈ ఒప్పందానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రెండు దేశాల మధ్య ఒప్పందం 'కాగితంపై సిద్ధంగా ఉంది' అని, ఈ జాప్యం కేవలం సాంకేతిక విధివిధానాల వల్లనే తప్ప న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య పరిష్కారం కాని విభేదాల వల్ల కాదని ఆ అధికారి స్పష్టం చేశారు. మరోవైపు, ఇతర దేశాల కంటే భారతీయ ఎగుమతిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా తక్కువ పన్ను నిబంధనలను సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది.

# ప్రైవేట్ స్కూళ్లలో 25% ఉచిత ప్రవేశాలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ సవరణల రూపకల్పన, పకడ్బందీ అమలు కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ ఏడాది జనవరి 13వ తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుతో పాటు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఈ ఉచిత ప్రవేశాల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉచిత సీట్ల కేటాయింపులో ఎలాంటి అక్రమాలు జరగకుండా, అసలైన అర్హులైన నిరుపేద విద్యార్థులకే ఈ ప్రయోజనం అందేలా పాత నిబంధనలను సవరించి కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు.

**16 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ**

నూతన మార్గదర్శకాల సవరణ బాధ్యతలను వేగవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా మొత్తం 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

ఈ రాష్ట్ర స్థాయి కమిటీ విద్యా హక్కు చట్టం అమలు తీరును, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల విధానాన్ని లోతుగా అధ్యయనం చేస్తుంది. అర్హతల నిబంధనలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, సీట్ల కేటాయింపు మరియు పాఠశాలల యాజమాన్యాలకు చెల్లించే ఫీజుల పునరుద్ధరణ వంటి అంశాలపై స్పష్టమైన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంది.కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా రాష్ట్రంలో కొత్త ఉచిత ప్రవేశాల గైడ్‌లైన్స్‌ను త్వరలోనే అమలు చేయనున్నారు.

# స్వయంకృతాపరాధమే
## కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం: విప్

(మొదటి పేజీ తరువాయి)




కుటుంబ సభ్యులు సీఎం గురించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సమయంలో వారించడంలోనూ సురేఖ విఫలమయ్యారని పేర్కొన్నారు. కొండా సురేఖ వ్యవహారశైలిపై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

**గతంలోనూ సర్దుకుపోయారు: ఆది శ్రీనివాస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సురేఖపై కోపం ఎందుకు ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. కొండా సురేఖ కుటుంబ సభ్యులు గతంలో చేసిన వ్యాఖ్యల విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి సంయమనంతో వ్యవహరించారని ఆది శ్రీనివాస్ చెప్పారు. ఇప్పుడు కూడా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసినా సీఎం ఎక్కడా బయటపడలేదని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై గౌరవం ఉంటే కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే చర్యలకు ఎందుకు పాల్పడ్డారని కొండా సురేఖను ప్రశ్నించారు.

**చిన్నారెడ్డిని కూడా..**

కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. చిన్నారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతో ఇష్టమైన నాయకుడని చెప్పారు. గతంలో ఆయనకు మద్దతుగా రేవంత్ రెడ్డి గోడలపై రాతలు రాసి ప్రచారం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే, పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టం చేసిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ధరల పెరుగుదల ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన కీలక నిత్యావసర వస్తువుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంతో పౌరసరఫరాల శాఖ నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు.

**కిలో ఉల్లిపాయలు రూ.35కే**

వినియోగదారులకు కిలో ఉల్లిపాయలను రూ.35కే అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఉల్లిపాయల నిల్వలను రాష్ట్రానికి కేటాయించే అంశాన్ని NCCF దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. కేంద్రం నుంచి కేటాయించిన నిల్వలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందుల కేటాయింపునకు విజ్ఞప్తి, కందిపప్పు ధరల నియంత్రణకు కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖను కోరారు. వాటిని ప్రాసెసింగ్ చేసి రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు కందిపప్పుగా వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు**

పామాయిల్ ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. NCCF ద్వారా పామాయిల్ సేకరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. NCCFతో సమన్వయం చేసుకుని అవసరమైన పామాయిల్‌ను సమకూర్చి వినియోగదారులకు సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

**651 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు**

బియ్యం ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 651 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్ల ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10,163 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, దాదాపు లక్షమంది వినియోగదారులు ప్రయోజనం పొందారు. వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే KNM రకం బియ్యాన్ని నెల్లూరు జిల్లాలోని రైస్ మిల్లర్ల నుంచి 10,000 మెట్రిక్ టన్నులు సేకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరకు విక్రయించడం ద్వారా పెద్ద మొత్తంలో బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది. ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. సామాన్య ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో లభించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు

అమరావతి, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

తెలుగుదేశం మంత్రులతో మంత్రి నారా లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రి లోకేశ్ అన్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రులకు తెలిపారు. అలాగే, స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని..ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. తొలుత పురపాలికలు, తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పని చేయవని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగి రాష్ట్రానికి నష్టం జరగాలనే కుట్రతో గొడ్డలి పార్టీ ఉందని మండిపడ్డారు. అన్ని కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించి తీరుతామని తేల్చిచెప్పారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతో పాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కుట్రల్ని ధీటుగా తిప్పికొట్టాలని మంత్రి అన్నారు. మాట వినని అధికారుల్ని ఉపేక్షించేది లేదన్నారు. కొందరు అధికారుల పనితీరు శాఖకు, మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరిద్దరు అధికారుల తీరు వల్లే ఇటీవల కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పుకొచ్చారు. వైద్య రంగానికి సంబంధించి ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని తప్పు పడుతూ కొందరు ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిపైనా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 9న అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి 3ఏళ్లు అవుతుందని, నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు అందరికీ గుర్తు చేసేలా సెప్టెంబర్ 9న ఓ కార్యక్రమానికి రూపకల్పన చేద్దామన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని మంత్రులతో లోకేశ్ పేర్కొన్నారు.

ఎన్నికలు వాయిదా వేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని నారా లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలు, ప్రచారాలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ సూచించారు. విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తప్పుడు ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు.

మంత్రికి, శాఖకు చెడ్డపేరు వచ్చేలా కొందరు అధికారుల పనితీరు ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని మంత్రి లోకేష్ హెచ్చరించారని తెలుస్తోంది. ఒకరిద్దరు అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఇటీవల కొన్ని సమస్యలు తలెత్తాయని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని లోకేష్ పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత మంత్రులు, అధికారులు తమ శాఖలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

సెప్టెంబర్ 9న పార్టీ అధినేతపై జరిగిన పరిణామాలను ప్రజలకు గుర్తు చేసేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నారా లోకేష్ సూచించినట్లు సమాచారం. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వ ప్రస్థానాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి పొదుపు చర్యలను పటిష్టంగా అమలు చేసి భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రులకు సూచించారు.

# కూతురు వ్యాఖ్యలే కారణం

(మొదటి పేజీ తరువాయి)




పార్టీలో ఎంతటి పెద్ద పదవిలో ఉన్నవారైనా క్రమశిక్షణ పాటించాల్సిందేనని, లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు. కూతురు వ్యాఖ్యలను ఖండించకపోవడమే కారణం కొండా సురేఖపై చర్యలు తీసుకోవడానికి ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలే ప్రధాన కారణమని మల్లు రవి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిని ఎవరైనా బహిరంగంగా దూషిస్తే లేదా విమర్శిస్తే, దానిని వెంటనే ఖండించాల్సిన ప్రాథమిక బాధ్యత క్యాబినెట్ మంత్రిగా ఉన్న కొండా సురేఖపై ఉందన్నారు. కానీ, తన కూతురు తప్పు చేసిందని ఆఖరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్ద కూడా ఆమె ఒప్పుకోకపోవడం, కనీసం ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం సరికాదన్నారు. పార్టీలో ఏవైనా సమస్యలు లేదా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగానే పరిష్కరించుకోవాలి తప్ప రోడ్డున పడేయకూడదని హితవు పలికారు.

**సమగ్ర విచారణ తర్వాతే నివేదిక**

కొండా సురేఖపై గతంలో కూడా పలు ఫిర్యాదులు క్రమశిక్షణ సంఘానికి అందాయని మల్లు రవి వెల్లడించారు. చట్టప్రకారం ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే తాను క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా సమగ్ర నివేదికను తయారు చేసి అధిష్టానానికి ఇచ్చానని తెలిపారు. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి విషయంలోనూ పూర్తి వివరాలు సేకరించి, వారి వ్యాఖ్యల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని గుర్తించిన తర్వాతే రిపోర్ట్ సమర్పించామన్నారు. ఈ నిర్ణయంలో ఎలాంటి కులాల ప్రాతిపదికన చర్యలు ఉండవని, కేవలం పార్టీ క్రమశిక్షణ మేరకే జరిగాయని స్పష్టం చేశారు.

**ఎంత పెద్దవారైనా లక్ష్మణ రేఖ దాటొద్దు**

ఈ రాజకీయంపై రాష్ట్రమంతటా తీవ్ర ఉత్కంఠ నెలకొన్న తరుణంలో ఏఐసీసీ నుంచి తుది నిర్ణయం వెలువడిందని తెలిపారు. నిర్ణయం తీసుకోవడం కొద్దిగా ఆలస్యమైనా పర్వాలేదు కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలనే ఉద్దేశంతోనే ప్రక్రియను నిర్వహించామని చెప్పారు. హోదా లేదా పదవి ఎంత పెద్దదైనా కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఎవరూ అతిక్రమించకూడదని, పార్టీ నిర్దేశించిన లక్ష్మణ రేఖను దాటవద్దని ఈ నిర్ణయం ద్వారా నిరూపితమైందని మల్లు రవి తేల్చి చెప్పారు.

# 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో

హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్




ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపించే ''ఎల్ నినో'' మరింత బలపడినట్లు ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో రుతుపవనాలు, ఉష్ణోగ్రత, వర్షాలపై ప్రభావం తప్పకపోవచ్చు. ఎల్ నినో ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో స్పష్టంగా ఏర్పడిందని, రాబోయే రోజుల్లో మరింత తీవ్రం కానుందని వెల్లడించింది. 2027 ప్రారంభం వరకు ఎల్ నినో కొనసాగించే అవకాశం దాదాపు 100 శాతంగా ఉండటంతో వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరులు వంటి వాతావరణ సున్నిత రంగాలు ముందస్తు సన్నద్ధతను పెంచుకోవాలని సూచించింది.

ఎల్ నినోకు కీలకమైన నినో 3.4 ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా భారీగా పెరిగాయి. 2026 మేజూలై మధ్య సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండగా, జూలైలో ఇది 2 డిగ్రీలకు చేరింది. జూలై చివరి నుంచి ఆగస్టు మధ్య వారాల్లో ఈ వ్యత్యాసం సుమారు 2.2 నుంచి 2.6 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదైంది. సముద్ర ఉపరితలం కింద పరిస్థితులు కూడా అసాధారణంగా ఉన్నాయి. ఉష్ణమండల పసిఫిక్ లోని కొన్ని ప్రాంతాల్లో జూలై, ఆగస్టు ప్రారంభంలో సముద్రం లోపల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 8 డిగ్రీల సెల్సియస్ పైగా నమోదయ్యాయి. ఇవన్నీ ఎల్ నినో బలపడేందుకు అనుకూల పరిస్థితులు కల్పించాయని వాతావరణ సంస్థ తెలిపింది.

**భారత్‌పై ప్రభావం ఎంత..?**

ఎల్ నినో ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. కానీ భారత్‌కు ఇది కీలక వాతావరణ సంకేతంగా మారింది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. గతంలో అనే సందర్భాల్లో ఎల్ నినో ఏర్పడిన సందర్భంలో భారత్‌లో రుతుపవనాలు చాలా బలహీనంగా మారిన చరిత్ర ఉంది.

2026లో భారత్‌లో ఇప్పటికే సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ సంస్థ(ఐఎండీ) అంచనా వేసింది. భారత్‌పై ఎల్ నినో ప్రభావాన్ని పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ (IOD) కొంతవరకు మార్చే అవకాశం ఉందని WMO తెలిపింది. 2026 సెప్టెంబర్‌నవంబర్ కాలంలో పాజిటివ్ IOD అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తోంది.

**ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం..**

చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ ప్రసరణలో గణనీయమైన మార్పులకు దారితీయవచ్చు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడి, కరువు, మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశాలు పెరుగుతాయి. అయితే, ఎల్ నినో ఎంత బలంగా ఉందనే విషయం ఏ దేశంపై ఎంత తీవ్ర ప్రభావం ఉంటుందో నిర్ణయించదు. ప్రాంతీయ పరిస్థితులు, సముద్ర ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ వ్యవస్థలు కూడా ప్రభావాన్ని మార్చే అవకాశం ఉందని WMO స్పష్టం చేసింది.

# 2 ఏళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలకు చంద్రబాబు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో గతంలో సస్పెండ్ అయిన ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులపై ఉన్న సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే తిరిగి సర్వీసులోకి తీసుకుంటూ సాధారణ పరిపాలన శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత 2 ఏళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్న వీరిద్దరూ త్వరలోనే విధుల్లో చేరనున్నారు. 2004 బ్యాచ్‌కు చెందిన కాంతి రాణా టాటా.. 2010 బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్నిలపై గతంలో సస్పెన్షన్ వేటు పడింది. అప్పటి నుంచి దాదాపు 2 ఏళ్లుగా వారు సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారు. తాజాగా సస్పెన్షన్ గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని సమీక్షించి కీలక నిర్ణయం తీసుకుంది.

ఇద్దరు ఐపీఎస్‌లపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడానికి ముందు రాష్ట్ర డీజీపీ సమర్పించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా ఆగస్ట్ 24వ తేదీన సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల ప్రతులను ఇద్దరు అధికారులకు అందజేసి.. వారి నుంచి రసీదులు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.

ముంబైకి చెందిన నటి కాదంబరి జత్వానీ వ్యవహారంలో అక్రమంగా కేసు నమోదు చేసి, ఆమెను అరెస్టు చేసి వేధించారనే ఆరోపణలు అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యవహారంలో అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాంతి రాణా టాటా.. అప్పటి డీసీపీ విశాల్ గున్నీలపై ఆరోపణలు వచ్చాయి. జత్వానీని అరెస్టు చేసిన తీరుపై నమోదైన కేసు, ఆ తర్వాత జరిగిన విచారణల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఈ ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ విధించింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అప్పట్లో రివ్యూ కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ వచ్చారు. అయితే వారిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసినంత మాత్రాన కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ఉన్న ఆరోపణలు లేదా కేసులు ముగిసినట్లు కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వారిపై కొనసాగుతున్న శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులపై సస్పెన్షన్ ఎత్తివేత నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంటే ఇద్దరు అధికారులు తిరిగి సర్వీసులోకి వచ్చినప్పటికీ, జత్వానీ కేసుకు సంబంధించిన దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలు వాటి దారిలో అవి కొనసాగనున్నాయి. సస్పెన్షన్ ఎత్తివేత కేవలం సర్వీస్ నిబంధనల ప్రకారం తీసుకున్న పరిపాలనా నిర్ణయంగానే ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో ఇద్దరు ఐపీఎస్ అధికారులు తిరిగి విధుల్లోకి చేరనున్నారు.

# పిల్లల్ని నేరగాళ్లుగా పరిగణించకూడదు

**- 20 ఏళ్ల క్రితం విధించిన శిక్ష రద్దు**

పిల్లల్ని నేరగాళ్లుగా పరిగణించకూడదని సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. ఆరోపిత నేరం చేసినప్పుడు మైనర్‌గా ఉన్న ఒక వ్యక్తికి పడిన శిక్షను రద్దుచేసింది. బాలలకు చట్టబద్ధంగా ఉన్న ప్రయోజనాలను తోసిపుచ్చజాలరని జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం వ్యాఖ్యానించింది. ''పరిస్థితుల చేతిలో బాలలు బాధితులు అవుతుంటారు. సామాజికఆర్థిక పరిస్థితులు, భావోద్వేగ/మానసిక అంశాలు కూడా కొన్నిసార్లు వారిని నేర ప్రపంచం వైపు నడిపిస్తుంటాయి. శాశ్వతంగా నిందితునిగా ముద్రవేసే బదులు అలాంటి వాళ్లను సమాజంలో తిరిగి కలిసేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బాలల న్యాయ చట్టం కల్పిస్తున్న రక్షణల గురించి ఆయా పక్షాలకు అవగాహన ఉండటం లేదు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల వలసలతో ప్రజల జీవితాలు మారిపోతున్నాయి. పట్టణాల్లో జనాభా, పేదరికం, అసమానత, నిరక్షరాస్యత, వివక్షాపూరిత వాతావరణం పెరిగి పిల్లల్ని అపరాధులుగా మారుస్తోంది. అది వారిని బాధితులుగా మారుస్తోంది'' అని ఒక కేసు తీర్పులో ధర్మాసనం విశ్లేషించింది.



సాధారణంగా దర్యాప్తు అధికారులు ఆయా కేసుల్లో బాలల వయసుపై దృష్టి సారించరని, దానివల్ల హక్కుల ఉల్లంఘన జరగడమే కాకుండా బాలలు బాధితులు అవుతున్నారని వ్యాఖ్యానించింది. ''ఏ దేశానికైనా బాలలే పెద్ద ఆస్తి. వారు బాధ్యతాయుత పౌరులుగా, అన్నివిధాలా దృఢంగా, ఆరోగ్యకరంగా ఉంటూ సమాజ అభ్యున్నతికి దోహదపడేలా చేయాలి. పిల్లలపై ప్రభుత్వాలు చేసే ఖర్చు.. వారు శక్తిమంతమైన మానవ వనరులుగా మారి, దేశాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు శక్తిమంతులైనవారిగా మారినప్పుడు తిరిగి వచ్చేస్తుంది. దర్యాప్తు ప్రక్రియ సమర్థతను పెంచేలా ప్రస్తుత వ్యవస్థ మారాలి'' అని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్‌లోని మురైనాలో 2004 సెప్టెంబరులో నమోదైన ఒక కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక మహిళ, ఆమె బిడ్డ మృతదేహాలు రైలుపట్టాలపై లభ్యమైన కేసులో పలువురిపై కేసు నమోదైంది. ఇది వరకట్న చావు అని, ఆధారాలు మాయం చేసేందుకు నిందితులు ప్రయత్నించారని అభియోగాలు నమోదయ్యాయి. నిందితుల్లో ఒకరి వయసు 17 ఏళ్లు. దీంతో కేసు తొలుత హైకోర్టుకు, తర్వాత సుప్రీంకోర్టుకు వచ్చింది.

**- ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నేతృత్వం వహించిన ఐఏఎఫ్ సీనియర్ అధికారి**

**- 5,585 దరఖాస్తులను వడగట్టి ఎంపిక**

## అయోధ్య రామాలయ ట్రస్ట్ తొలి సీఈవోగా ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్ర

భారత వాయుసేన (ఐఏఎఫ్) మాజీ ఉన్నతాధికారి, ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్ర.. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి సీఈవోగా బుధవారం నియమితులయ్యారు. సీఈవో పోస్టుకు మొత్తం 5,585 దరఖాస్తులు రాగా వివిధ దశల్లో వాటిని వడగట్టిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ...చివరకు అన్ని విధాలా అర్హతలున్న, అత్యంత సమర్థులైన ముగ్గురు అభ్యర్థుల పేర్లను ట్రస్ట్‌కు సిఫార్సు చేసింది. ఆ ముగ్గురిలో ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్ర (62) ఎంపికయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అత్యంత కీలకమైన వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఎయిర్ మార్షల్ జితేంద్ర నేతృత్వం వహించారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు 'సర్వోత్తమ్ యుద్ధ సేవా మెడల్' పురస్కారం లభించింది. సైన్యంలో దీర్ఘకాలం సేవలందించినందుకు గాను 'అతి విశిష్ట సేవా మెడల్', 'విశిష్ట సేవా మెడల్' పురస్కారాలనూ ఆయన అందుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్ర...1986 డిసెంబరు 6న పైలట్‌గా ఐఏఎఫ్‌లో చేరారు. వివిధ హోదాల్లో 39ఏళ్ల పాటు సేవలందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. రామాలయ విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలిసారి సీఈవోని నియమించాలని నిర్ణయించింది.

భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, వడపోతకు కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎంపిక కమిటీ వినియోగించింది. దీనిలో భాగంగా 5,585 మంది అభ్యర్థుల్లో 3,577 మంది మాత్రమే 600 మార్కుల విధానం కింద పరిశీలన కోసం వివరాలను సమర్పించారు. ఈ ప్రక్రియలో 470కి పైగా మార్కులు వచ్చిన 108 మంది అభ్యర్థులను వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేశారు. వీరి నుంచి 16 మంది అభ్యర్థులను ఎంపిక చేసి అయోధ్యలో ఆగస్టు 11, 12 తేదీల్లో ముఖాముఖి భేటీలు నిర్వహించారు. చివరకు సమర్థ నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలు, సత్యనిష్ఠ, దార్శనికత గలిగిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక కమిటీ రూపొందించి ట్రస్ట్‌కు అందజేసింది.





**ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం సమావేశమై ఎంపిక కమిటీ సమర్పించిన సీఈవో అభ్యర్థుల జాబితాను పరిశీలించింది. సీఈవోగా జితేంద్ర మిశ్ర వైపు మొగ్గు చూపింది. ట్రస్ట్ మాజీ కోశాధికారి గోవింద్ దేవ్ గిరిని.. ప్రధాన కార్యదర్శిగా, మహేశ్ భాగ్‌చంద్కాను కోశాధికారిగా నియమించింది. ట్రస్ట్ సభ్యులుగా అయోధ్యకి చెందిన మదన్ మోహన్ పాండే, దిల్లీకి చెందిన బాగ్‌చంద్కా, నిర్మల్ యాదవ్‌లను బోర్డులోకి తీసుకున్నారు.

# విడిగా ఉంటూ భార్యగా ఉంటానంటే ఎలా?



**- జంటకు సుప్రీంకోర్టులో విడాకులు**

వివాహాన్ని కాపాడటమే సంబంధిత చట్టం ప్రాథమిక లక్ష్యమైనా భార్యాభర్తలు దీర్ఘకాలం పాటు విడివడి ఉంటున్నప్పుడు ఆ పరిస్థితిలో వాస్తవికతను గుర్తించాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. 2005 డిసెంబరు నుంచి వేర్వేరుగా జీవిస్తున్న దంపతులకు విడాకులు మంజూరుచేస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్య చేసింది. భార్యకు శాశ్వత భరణం కింద రూ.7 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తనకు విడాకులు మంజూరు చేయడానికి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భర్తను విడిచిపెట్టే ఉద్దేశం భార్యకు లేదని హైకోర్టు భావించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది.

అత్తవారింటికి తీసుకువెళ్లేందుకు భర్త ఎన్ని ప్రయత్నాలు చేసినా తగిన కారణం లేకుండానే ఆమె నిరాకరించేదని గుర్తుచేసింది. దంపతులకు పిల్లలు లేకపోవడం, రాజీ కుదిర్చే ప్రయత్నాలు ఇన్నేళ్లలో విఫలం కావడం వల్ల విడాకులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ''ప్రస్తుత కేసులో భార్య తన వైవాహిక సంబంధ బాధ్యతల్ని నిర్వర్తించేందుకు సుముఖత వ్యక్తంచేశారు. ఆమె ప్రవర్తన వేరేవిధంగా ఉన్నందువల్ల కేవలం హామీ సరిపోదు. వివాహ బంధం పునరుద్ధరించగల స్థితిలో ఉందా, లేదా అనేది తేల్చడంలో వారిద్దరూ దీర్ఘకాలం నుంచి విడివిడిగానే జీవిస్తున్నారనేది కీలకమైన అంశమని మరో తీర్పులోనూ సుప్రీంకోర్టు గతంలో చెప్పింది'' అని వివరించింది.

సంధికాలంలో కమిషన్లు పనిచేయకపోవడం తగదు

రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కమిషన్లలో ఖాళీల గురించి స్థాయీ నివేదికపై రాష్ట్రాలన్నీ మూడు వారాల్లో స్పందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం సంధికాలం వల్ల ఏ కమిషన్ కూడా పని చేయకపోవడం తగదని స్పష్టంచేసింది. కమిషన్ సభ్యులకు జీతభత్యాలపై తాము ఇదివరకు ఇచ్చిన ఆదేశాలపై చర్యా నివేదికను సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం బుధవారం ఆదేశించింది.

**నీట్-పీజీ రీఎగ్జామ్‌పై..**

నీట్ పీజీ పరీక్షను రాయలేకపోయిన 2,445 మంది కోసం దానిని మళ్లీ నిర్వహించాలని నిర్ణయించడాన్ని కొంతమంది సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇదివరకు సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ఉత్తర్వును ఇది ఉల్లంఘిస్తోందని వారు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. జస్టిస్ పి.ఎస్.నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం నీట్ వ్యవహారాలన్నింటిపై విచారణ చేపట్టిన దృష్ట్యా అక్కడే దీనిని ప్రస్తావించాలని సీజేఐ సూచించారు.

# డంపింగ్ యార్డుగా మారిన నదిని శుభ్రం చేసి.. సామాజిక స్పృహ చాటి!





సాధారణంగా డిగ్రీ చదివే విద్యార్థులు స్నేహితులతో కాలక్షేపం, పరీక్షలు, భవిష్యత్తు కార్యాచరణకే ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. కానీ, ఓ డిగ్రీ విద్యార్థి మాత్రం తన ఆలోచనలను పర్యావరణ పరిరక్షణ వైపు మళ్లించాడు. కాలుష్యం బారినపడిన ఓ నదిలో కొంత భాగం శుభ్రం భాష్ అనిపించుకున్నాడు. అతడి సామాజిక స్పృహకు సంబంధించిన కథనాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన బిట్టూ తబాహి డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నదిలో ఓ చోట భారీ స్థాయిలో చెత్త పేరుకుపోవడాన్ని గమనించాడు. ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా కనిపిస్తోన్న నదిని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ ఏడాది జనవరి 26న రంగంలోకి దిగాడు. అతడికి ఈత కూడా రాదు. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా వ్యర్థాలు తొలగించే పని మొదలుపెట్టాడు.

కొన్ని రోజులకే బిట్టూ చేతులతోపాటు తోడుగా వచ్చిన ఓ మిత్రుడి కాళ్లకూ ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో కుటుంబీకులు ఇలాంటి పనులు వద్దని సూచించారు. అయినా బిట్టూ వెనకడుగు వేయలేదు. అందులోని వ్యర్థాలను బయటకు తీసి కంపోస్టుగా మార్చాడు. స్నేహితులతో కలిసి నగదు సేకరించి వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన పరికరాలు, చెత్త డబ్బాలను కొనుగోలు చేశాడు. బురదనూ తొలగించాడు. కొన్ని నెలల్లోనే ఆ నది శుభ్రంగా మారిపోయింది. ఇందుకోసం దాదాపు రూ.30వేలు ఖర్చు పెట్టాడట. యువకుడు చేసిన ఈ ప్రయత్నాలు కొన్ని రోజుల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈ యువకుడి గురించి ఆనంద్ మహీంద్రా కూడా ఓసారి ప్రస్తావించారు. విమర్శలు వచ్చినప్పటికీ సామాజిక స్పృహ కనబరుస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడంటూ కొనియాడారు. ఇదిలాఉంటే, బిట్టు ఇంటిపేరు తబాహి.. అంటే హిందీలో విధ్వంసం, వినాశనం అని అర్థం. అందుకు అనుగుణంగానే కాలుష్యాన్ని నాశనం చేయడమే తన ఆశయమని, ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన నదిని పునరుద్ధరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నానని బిట్టూ చెప్పడం విశేషం.

## జగన్నాథుడి బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1912 కోట్లు.. 60,821 ఎకరాల భూమి..!

**ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. ఆ ఆలయం పేరిట దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో రూ.1,912 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పాలనావిభాగం (ఎస్‌జేటీఏ) ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటిలో రూ.1,811 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉండగా.. మరో రూ.100.71 కోట్లు సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లో ఉన్నట్లు తెలిపింది. డిపాజిట్ చేసిన మొత్తంలో రూ.500 కోట్లు ఒడిశా ప్రభుత్వం అందించిన కార్పస్ ఫండ్ అని పేర్కొంది. స్వామివారి పేరిట దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 60,821 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60,426 ఎకరాలు ఒడిశాలోనే ఉన్నాయి. ఆలయ రత్నభండార్‌లో బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే ఆదాయంలో.. భక్తులు ఇచ్చే కానుకలు, ఆలయం పేరిట ఉన్న క్వారీలు, గనుల నుంచి వచ్చే సొమ్ము, డిపాజిట్లపై వడ్డీ, ప్రభుత్వ గ్రాంట్లు, భూవిక్రయాలు భాగమని పాలనా విభాగం పేర్కొంది. "ఈ ఆదాయంలో ఒక భాగాన్ని కార్పస్ ఫండ్‌గా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. ఫౌండేషన్ ఫండ్‌గా ఇంకొంత మొత్తాన్ని జమ చేస్తాం. మిగతా సొమ్మును ఆలయ నిధిగా ఉంచుతాం" అని ఎస్‌జేటీఏ ప్రధాన పాలనాధికారి వెల్లడించారు.**

**ఇక, ఆలయ నిధిని రోజువారీ ఖర్చుల కోసం వాడుతుంటారు. హుండీ విరాళాలను ప్రతిరోజూ లెక్కిస్తారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు భక్తులు తెలుసుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే పూరీ ఆలయం 'సమర్పణ్' పేరిట ఒక డిజిటల్ డొనేషన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా నిర్వహిస్తోంది.**

## నారీకేళంతో.. నమో లంబోదరా!



దేశంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు పూజలందుకుంటాయి. ఈసారి మరో సరికొత్త రూపంలో వినాయకుడు దర్శనమివ్వనున్నాడు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కేరళంలోని తిరువనంతపురంలో బుధవారం నిర్వహించిన ప్రదర్శనలో కొబ్బరి చిప్పలతో రూపొందించిన లంబోదరుడి విగ్రహాలు, ఇతర ప్రతిమలు ఆకట్టుకున్నాయి. 'స్థానిక సుస్థిరత, జీవనోపాధి మెరుగుదల' ఇతివృత్తంగా ఈ ప్రదర్శనను ఏటా నిర్వహిస్తుంటారు.

## బట్ట మేక పక్షులను రక్షించుకోవాలి



అంతరించిపోతున్న బట్టమేక పక్షి(గ్రేట్ ఇండియన్ బస్టర్డ్)ని రక్షించుకునేందుకు 16 ప్రదేశాలను ప్రాధాన్య సంరక్షణ ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని దేహ్రాదూన్‌లోని భారత వన్య ప్రాణి సంస్థ పరిశోధకులు సూచించారు. దాదాపు 18,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన ఈ ప్రదేశాలు 35 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వాటిలో మహారాష్ట్రలో 22, కర్ణాటక, తెలంగాణలలో ఆరు చొప్పున, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి ఉన్నాయి. బట్టమేక పక్షి ప్రపంచంలోనే అత్యంత బరువైన ఎగిరే పక్షులలో ఒకటి. ఒక పక్షి బరువు 15 కిలోగ్రాముల వరకు ఉంటుంది. గుబ్బి ల్యాబ్స్ అనే భారతీయ పరిశోధనా సంస్థ అధ్యయనం ప్రకారం ఇటీవల భూ వినియోగంలో వచ్చిన మార్పుల వల్ల మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బట్టమేక పక్షుల సంఖ్య పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని దీన్ని నివారించి ఆ పక్షులను కాపాడుకోవాలని తెలిపింది.

## 200 ఏళ్ల తర్వాత అమ్మాయి.. సంబరాలు మోత మోగాయి



ఆడపిల్లల జననంపై ఇప్పటికీ సంకుచిత దృక్పథంతో ఉన్న మన సమాజంలోని ఎంతోమందికి ఇదో సానుకూల సందేశం. ఆ కుటుంబంలో ఏకంగా 200 ఏళ్ల తర్వాత ఓ ఆడపిల్ల పుట్టింది. కొన్ని తరాల పాటు ఎదురుచూసిన క్షణం కళ్ల ముందు సాక్షాత్కరించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. తమ ఇంటి మహాలక్ష్మిని దారి పొడవునా సంబరాలతో ఇంటికి తీసుకొచ్చారు. ఈ ఘటన మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరిగింది. లింబాజీ కుటుంబానికి చెందిన రిషికేశ్ దహిఫాలే భార్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ చిన్నారికి 'గార్గి' అని పేరు పెట్టారు. ఆస్పత్రి నుంచి ఇంటి వరకు రథంపై ఊరేగిస్తూ మేళతాళాలు, నృత్యాలతో చిన్నారిని తీసుకొచ్చి బంధుమిత్రుల సమక్షంలో ఘనస్వాగతం పలికారు. ఇన్నాళ్లకు ఆ మహాలక్ష్మి కరుణించి, తమ ఇంట అడుగు పెట్టిందని తాత లింబాజీ దహిఫాలే ఆనందం వ్యక్తం చేశారు. ''కూతుళ్ల ప్రేమ ఎప్పుడూ ప్రత్యేకమే. నేను నా చిట్టిపాపను అపురూపంగా పెంచుతాను'' అని గార్గి తండ్రి సంతోషం వ్యక్తం చేశారు.

## సీజేపీ తనిఖీ చేసిన పాఠశాల భవనం కూల్చివేత

**రాజస్థాన్ రాజధాని నగరమైన జైపూర్ సమీప సంగనేర్ బ్లాకులో ఉన్న రాంపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాత భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ఏడాది కిందటే శిథిలావస్థలో ఉన్నట్లు ప్రకటించిన ఈ పాఠశాలను 'స్కూల్ లీక్ కరో' కార్యక్రమంలో భాగంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు ఆగస్టు 21న తనిఖీ చేశారు. బడిలోని పిల్లలకు పశువుల పాకలో చదువులు చెబుతున్నట్లుగా బయటపెట్టారు. ఇదే సందర్భంగా సీజేపీ బృందాన్ని గ్రామస్థులు అడ్డుకొని దాడికి దిగిన విషయం తెలిసిందే. దీనిపై ఇరువైపులా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తమపై దాడి భాజపా కార్యకర్తల పనిగా సీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారుల సమక్షంలో పాత భవనం కూల్చివేత జరిగింది. ఈ పాఠశాలకు కొత్త భవనం నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరుచేస్తూ రాజస్థాన్ ప్రభుత్వం ఆగస్టు 23న ఉత్తర్వులు జారీ చేసింది.**

## ఒంటికాలితో గెంతుతూ బడికి.. ఏడేళ్ల చిన్నారి చదువు సంకల్పం

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లా రాణీపుర్‌కు చెందిన రాగిణి (7)కి అందరు పిల్లల్లా తానూ ఆడుకోవాలని ఉన్నా.. ప్రమాదం కారణంగా ఓ కాలు అవిటిగా మారడంతో వీలుపడలేదు. చదువు విషయంలో మాత్రం అలాగని ఆమె ఊరుకోలేదు. స్నేహితులు భుజాలకు సంచులు వేలాడేసుకొని స్కూలుకు వెళ్తుంటే.. తానూ వెళ్తానని పట్టుబట్టింది. ఇంటి నుంచి దాదాపు అర కిలోమీటరు ఉన్న పాఠశాలకు నిత్యం ఒంటికాలితో గెంతుతూ వెళ్తోంది. ఆర్నెల్ల వయసులో రాగిణికి జరిగిన ప్రమాదం తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించామని, మెరుగైన చికిత్సకు ఆర్థికస్తోమత చాలక ఇంటికి తీసుకువచ్చేసినట్లు ఆమె తల్లి బబితాదేవి తెలిపారు. రాగిణి తండ్రి ఓ దినకూలీ. ఒకటో తరగతి చదువుతున్న ఈ చిన్నారి కథ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ స్పందించారు. రాగిణికి ట్రైసైకిలు, ఆమె కుటుంబానికి రూ.26,500 ఆర్థికసాయాన్ని అందించారు. వీడియోకాల్ ద్వారా మాట్లాడి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. జిల్లా కలెక్టర్ మంగళ ప్రసాద్ సింగ్ బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడి, తగిన వైద్యసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.**



# ట్రంప్‌కు ఎదురుగాలి!

రెండో దఫా అధికార పీఠం అధిరోహించి కూడా రెండేళ్లు కావస్తున్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్‌కు దౌత్యనీతి ఒంటబట్టలేదు. తాను నిర్దేశించినదాన్ని అంగీకరించటమే తప్ప మరోవిధంగా మాట్లాడే హక్కు, అధికారం ఏ దేశానికీ లేదని ఆయన ఇప్పటికీ నమ్ముతున్నారు. ఆయన దృష్టిలో కేవలం అదే దౌత్యం. భారత్ నుంచి కెనడా వరకూ... ఇరాన్ నుంచి వెనిజులా వరకూ ఆయనది ఇదే బాణీ. ట్రంప్‌ను నేరుగా ప్రతిఘటించే వారుండొచ్చు, పరోక్షంగా చెప్పిచూద్దామనుకునే వారుండొచ్చు... మార్గాలు వేరైనా ట్రంప్ షరతులకు తలొగ్గబోమని చెప్పడమే వీరందరి సారాంశం.

చాన్నాళ్లుగా విసుగెత్తి ఉన్నారేమో... కెనడా ప్రధాని మార్క్ కెర్నీ చాలా కరకుగానే వ్యవహరించారు. ఒకదాని వెంబడి మరో గొంతెమ్మ కోర్కెతో చీకాకుపరుస్తున్న అమెరికా తీరును నిరసిస్తూ వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కురావాలని ఆదేశించారు. ఒప్పందం దాదాపు ఖరారై సంతకాలు జరపడమే తరువాయి అనుకునే దశలో ఎదురైన ఈ ఊహించని పరిణామం అమెరికాను అయోమయంలోకి నెట్టింది. ఇలాంటి భంగపాట్లే ఇరాన్ దగ్గర ఎదురయ్యాయి. మన దేశంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని అమెరికా అనేకమార్లు ప్రకటించింది. కానీ అదేమీ జరగలేదు.

వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తన సైన్య బలంతో ఈ ఏడాది మొదట్లో అపహరించి, అమెరికాలో ఆయనపై విచారణ తంతు సాగిస్తున్నారు. ఇకపై అది తమ భూభాగమని అమెరికా చెప్పడం ఆ దేశ ప్రజల్ని మాత్రమే కాదు... అత్యధిక దేశాలను ఆగ్రహోదగ్రుల్ని చేస్తోంది. ఇక ఇరాన్ సంగతి చెప్పనవసరం లేదు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపేశామని చెప్పటం నుంచి హార్ముజ్ తమదేనని ప్రకటించటం వరకూ ట్రంప్ ఎన్ని చేసినా ఇరాన్ నిబ్బరంగా 'నీ లెక్కేమిట'న్నట్టే వ్యవహరిస్తోంది.

మిత్ర దేశమైన దక్షిణ కొరియాదీ అదే వైఖరి. ఏటా 11 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుపుతాయి. ఈసారి అయిదో రోజుకల్లా అమెరికా సైనికులు తట్టా బుట్టా సర్దుకుని తిరుగుముఖం పట్టారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో చెలిమి కోసం ట్రంప్ తహతహలాడటంపై ఆగ్రహించి దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఈ విన్యాసాల ఉద్దేశం ఉత్తర కొరియాను భయపెట్టడం. తీరా ఆ దేశంతోనే అమెరికా చేతులు కలుపుతుంటే... ఈ విన్యాసాలకు అర్థమేమిటన్నది దక్షిణ కొరియా ప్రశ్న. వాస్తవానికి ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వస్త్ర దేశంగా మారింది. ఆ దేశం దగ్గర 'చాలా శక్తిమంతమైన' ఆయుధా లున్నాయని ట్రంపే కొద్దికాలం క్రితం ప్రకటించారు. దాన్ని మరిచి కొత్త చుట్టరికాలు కలుపుకుందామని ట్రంప్ ప్రయత్నించినంత మాత్రాన ఆ దేశం నమ్మే అవకాశమేమీ లేదు.

ఇరాన్‌తోసహా అన్ని దేశాలతోనూ దౌత్యపరంగా వరస వైఫల్యాలు తప్పడం లేదు గనుక ఉత్తర కొరియాకు దగ్గరై అమెరికా జనాన్ని ఆశ్చర్యపరచాలని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ వేరే దేశాలతో పెంచుకున్న వైరం వికటిస్తున్న విధంగానే ఉత్తర కొరియాతో చెలిమి సైతం బెడిసికొట్టే అవకాశం లేకపోలేదు. చివరకు ఉత్తర కొరియాఏం చేస్తుందన్నది అలావుంచితే... ఆసియా–పసిఫిక్ దేశాలన్నిటా ట్రంప్ అంతరంగంపై ఇప్పటికే ఉన్న సందేహాల్ని మరింతగా పెంచింది. ఈ దేశాలన్నీ చైనా దూకుడువల్ల చాలా ఇబ్బంది పడుతున్నాయి. ఇలాంటి సమయంలో తమకు అండగా నిలిచి, చైనాకు కళ్లెం వేయాల్సిన అమెరికా ఆడుతున్న వింతనాటకాలు వాటికి మింగుడుపడటం లేదు.

అందుకే దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల సాన్నిహిత్యమవుతున్నాయి. ఆ రెండింటిమధ్యా ఇబ్బందికర చరిత్రవున్నా ట్రంప్ వింత చేష్టలు వారిని సన్నిహితం చేశాయి. కెనడా ఉత్పత్తులపై 50 శాతం అదనపు సుంకాలు వేయాల్సివస్తుందని ట్రంప్ ప్రకటించగా, దానికి ప్రతిగా వచ్చే నెల 8 నుంచి అమెరికా ఉత్పత్తులపై 15 నుంచి 50 శాతం వరకూ సుంకాలు విధిస్తామని కెర్నీ ప్రకటించారు. అమెరికా అదనపు సుంకాల విలువ 2,000 కోట్ల డాలర్లయితే, కెనడా సుంకాలు 2,760 కోట్ల డాలర్లు. ఈ ప్రపంచం తనకు భయపడటం మాట అటుంచి... జాలి కూడా చూపబోదని ట్రంప్‌కు ఎంత త్వరగా తెలిస్తే అమెరికా ప్రజలకు అంత మేలు.



# 'పీఓకే' పాకిస్థాన్ చేజారుతోందా?

ఇంతకాలం తమను పాకిస్థానీయులుగా భావించుకుంటూ, భారతీయ హోదా ఎన్నటికీ అంగీకరించబోమని చెబుతూ వస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజానీకం నేడు పాకిస్థాన్ చెర నుంచి విముక్తం కావాలని ఆందోళన బాట పట్టడం ఓ గొప్ప చరిత్రాత్మక పరిణామం. గత కొంతకాలంగా పీఓకేలోని ప్రజలు తీవ్రమైన ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. బియ్యం, గోధుమలు, నూనెలు, పప్పుధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పెట్రోల్ ధరలు మండిపోతున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 45 లక్షల మంది సతమతమవుతున్నారు.భారత భూభాగం నుంచి ఆక్రమించుకున్న ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ 'ఆజాద్ కశ్మీర్'గా పిలుచుకుంటోంది. ఈ ప్రాంతానికి ప్రజలు ఎన్నుకునే ప్రధానమంత్రి, అధ్యక్షుడు, శాసన వ్యవస్థ, సొంత అధికారిక జెండా మొదలైనవి ఉన్నప్పటికీ పాలనాధికారాలన్నీ పాకిస్థాన్ ప్రభువుల చేతుల్లోనే ఉంటాయి.భారత్‌ను బూచిగా చూపిస్తూ ఇన్నాళ్లూ పాక్ పాలకులు పీఓకే ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే పాక్ కారణంగా అనేక ఏళ్లుగా పీఓకేలో అభివృద్ధి నిలిచిపోయింది. ప్రజలకు స్వేచ్ఛ లేదు. ఉగ్రవాద కార్యకలాపాలు ఒక్కటే అక్కడ పెరిగాయి. పీఓకేను చెప్పచేతల్లో పెట్టుకున్న పాకిస్థాన్‌ను దారుణమైన ఆర్థిక సంక్షోభం వెంటాడుతోంది. మరోవైపు భారత్‌లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్ క్రమంగా పూర్వస్థితికి చేరుకుంటోంది. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయి. కాశ్మీరీ పండిట్లకు స్థానిక ముస్లిం ప్రజలు సాదర ఆహ్వానం పలుకుతున్నారు. పర్యాటక రంగం గణనీయంగా కోలుకుంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన క్రీడాకారులు దేశం తరపున వివిధ క్రీడలలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అంతర్జాతీయ సమాజానికి గొప్ప సంకేతం ఇచ్చినట్లయింది.




అంతర్జాతీయ పరిణామాలు.. ముఖ్యంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికాల మధ్య సాగుతున్న భీకరపోరు కారణంగా అనేక దేశాలలో వాణిజ్యం, ఎగుమతి దిగుమతులు నిలిచిపోయి అవి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, 145 కోట్ల జనాభా కలిగిన భారత్ మాత్రం కొద్దిపాటి ఒడుదుడుకులు మినహా దృఢంగా, నిబ్బరంగా నిలబడగలుగుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో, ఆహార భద్రతలో భారత్ ప్రపంచ దేశాలలో మొదటి పది స్థానాలలో ఒకటిగా నిలబడగలిగింది.

దివాళా అంచున నిలబడిన పాకిస్థాన్ గత ఏడు దశాబ్దాలకు పైగా తన నియంత్రణలో ఉంచుకున్న పీఓకేపై పట్టు కోల్పోతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హోరెత్తుతున్నాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ), స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థలతో ఏర్పడిన ఐక్య కార్యాచరణ సమితి వంటివి.. ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యంగా అదుపుతప్పిన ధరలు, ఆహారం, విద్యుత్ కొరతలను నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నాయి.

ఆశ్చర్యం ఏమంటే, జేఏఏసీ చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమాలలో పాల్గొంటున్న ప్రజలు 'పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదు' అనే నినాదాలు చేస్తున్నారు. తమ ప్రాంతంలో అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న పాకిస్థానీ ఉన్నత వర్గాల ప్రత్యేక హక్కులను, సదుపాయాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఓకేలో సాగుతున్న ఆందోళనను బలప్రయోగంతో అణచివేయాలని పాక్ పాలకులు చూస్తున్నారు. అత్యంత అమానవీయంగా పాకిస్థాన్ భద్రతా దళాలు పీఓకే ప్రాంతంలో ప్రసార మాధ్యమాలను నియంత్రిస్తున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం లేకుండా చేశాయి. పైగా, ప్రజలకు నిత్యావసర సరుకులు, వైద్య సామగ్రిని సైతం నిలిపివేయడం అంతర్జాతీయ సమాజాన్ని నివ్వెరపరుస్తోంది. పీఓకేలోని ప్రజలను పాకిస్థాన్ తమ సొంత పౌరులుగా భావించేటట్లయితే ఆర్థిక దిగ్బంధనాలు ఎలా విధిస్తారని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించే ఇటువంటి వైఖరి కారణంగానే.. స్వతంత్ర పౌరులుగానో లేదా కశ్మీరీ పౌరులుగానో తమను గుర్తించాలని కోరుతున్నామని పీఓకేలోని మెజారిటీ ప్రజలు వాదిస్తున్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ తమ దేశంలో అంతర్భాగమని భారత్ మొదటి నుంచి వాదిస్తూనే ఉంది. ఈ కారణంతోనే పీఓకేను పాకిస్థాన్ చిత్రపటంలో భాగంగా చూపించదు. పైగా జమ్మూ కశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో కూడా రాష్ట్ర శాసనసభలో 24 అసెంబ్లీ స్థానాలను పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించారు. ఈ ప్రాంతంపై భారతదేశానికి ఉన్న చిరకాల రాజ్యాంగ హక్కును, శాసనహక్కును నొక్కి చెప్పేందుకే ఈ స్థానాలను గతంలో లాగా ఖాళీగా ఉంచి రిజర్వ్ చేశారు. అంటే ఈ ప్రాంతం భారత్ పరిపాలనలోకి వస్తే పీఓకే ప్రాంతంలో డీలిమిటేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం అధికారికంగా నిర్వహిస్తుంది. అందుకు సంబంధించి చేసిన చట్టంలో పలు నిబంధనలు చేర్చారు.

పీఓకేను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకునే సామర్థ్యం భారతదేశానికి లేకపోలేదు. కానీ బలవంతపు విలీనం భారత్‌కు ఇష్టం లేదు. ప్రత్యక్ష సైనిక దాడికి బదులుగా దౌత్యపరమైన ప్రక్రియతోను, స్థానిక ప్రజల అభీష్టం మేరకే ఈ అంశాన్ని పరిష్కరించాలని భారత్ భావిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సామాజిక అభివృద్ధి కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ చివరకు స్వచ్ఛందంగా భారత్‌లో విలీనం కోరవచ్చని ఇటీవల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆక్రమిత భూభాగంలో పౌర అశాంతి కారణంగా విలీనం చేసుకుంటే కొన్ని సమస్యలు ఎదురవుతాయన్న వాస్తవం భారత్‌కు తెలుసు. పీఓకే అంశంపై ఇప్పటికే భారత్... ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసి, న్యాయం కోసం దౌత్యపరమైన ఒత్తిడి తెస్తోంది. అలాగే దాదాపు 45 లక్షల సంఖ్యలో ఉన్న జనాభాను నిర్వహించడమనేది, వారి పూర్తి అంగీకారం లేకుండా సజావుగా జరిగే పని కాదు.

పీఓకేను వదులుకోవడం మొదటి నుంచి పాకిస్థాన్‌కు ఇష్టం లేదు. అనుకూలమైన భౌగోళిక పరిస్థితుల కారణంగా అక్కడి నుంచి తమ మిలిటెంట్లను భారత భూభాగంలోకి పంపడం వారికి తేలిక కనుక ఎట్టి పరిస్థితులలోనూ పీఓకేను వదులుకోవడానికి పాకిస్థాన్ సిద్ధంగా లేదు. ఈ కారణంగానే, ఒకవైపు పీఓకేలో తిరుగుబాటును సైనిక చర్య ద్వారా అణచివేస్తూ, మరోవైపు ఇతర ఇస్లామిక్ దేశాల మద్దతు కోరుతోంది. అంతేకాకుండా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ పీఓకే భూభాగంతో అనుసంధానమై ఉన్నందున.. పీఓకే విషయంలో భారత్ ఏ మాత్రం తొందరపడినా చైనా జోక్యం తప్పదని పాకిస్థాన్ నమ్ముతోంది.

పీఓకేలో ప్రస్తుతం సాగుతున్న ఆందోళనలు పరాకాష్ఠకు చేరితే వాటిని నియంత్రించడం పాకిస్థాన్‌కు సాధ్యం కాదు. ప్రస్తుతం దేశ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు పీఓకే పెద్ద తలనొప్పిగా తయారైంది. అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠ నానాటికీ దిగజారిపోతోంది. పొరుగున తాలిబన్ల ఆధీనంలో ఉన్న అఫ్గానిస్థాన్‌తో కూడా పాకిస్థాన్ సఖ్యతగా లేదు. బంగ్లాదేశ్‌లోని కొత్త ప్రభుత్వంతో అనుకూలంగా ఉంటున్నప్పటికీ పాకిస్థాన్‌కు అక్కడి మెజారిటీ ప్రజల మద్దతు లేదు. చైనా ఒక్కటే వివిధ స్వప్రయోజనాల రీత్యా పాక్‌కు ఆపన్న హస్తం అందిస్తోంది.

ఇప్పటికిప్పుడు పీఓకే భారత్‌లో విలీనం అవుతుందని భావించలేము. పీఓకేను బలవంతంగా స్వాధీనం చేసుకొనే అవకాశం కూడా లేదు. ఒకవేళ భవిష్యత్తులో పీఓకే కనుక భారత్‌లో విలీనం అయితే తప్పనిసరిగా భారత్‌కు అనేక ప్రయోజనాలు ఒనగూరుతాయి. ప్రత్యేకించి వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత, ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. మధ్య ఆసియా దేశాలకు భూమార్గం సుగమం కావడం, పాకిస్థాన్ నుంచి వచ్చే చొరబాటుదార్లను నిరోధించడం సాధ్యపడతాయి. ప్రధానంగా పాక్-చైనాల ఎకనామిక్ కారిడార్ పనులు నిలిచిపోయి పాకిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలహీనపడుతుంది.

ప్రస్తుతం యావత్ ప్రపంచ దృష్టి ఇరాన్-అమెరికా యుద్ధంపైనే ఉండటం వల్ల పీఓకేలో వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు అంతర్జాతీయ సమాజం దృష్టిని పెద్దగా ఆకర్షించడం లేదు. అయితే, ఇటీవల జెనీవాలో పీఓకే మద్దతుదారులు నిర్వహించిన భారీ ప్రదర్శనతో పీఓకేలో జరుగుతున్న మానవహక్కుల హననంపై యునైటెడ్ నేషన్స్ దృష్టి సారించింది. జమ్మూ కశ్మీర్ అంశంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న కొన్ని అసాధారణ నిర్ణయాలు ప్రస్తుతం సానుకూల పరిస్థితులను ఏర్పరిచాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సంపద పెరిగి స్థూల రాష్ట్ర ఉత్పత్తి పెరిగింది. అన్నిటికంటే ముఖ్యంగా అక్కడ ప్రశాంత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో సహజంగానే పీఓకే ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో అంతర్భాగం కావాలని భావిస్తున్నారు. మెజారిటీ ప్రజల మద్దతు కోల్పోయిన తర్వాత పీఓకేలో పాకిస్థాన్ పట్టు ఎంతోకాలం నిలబడదు. అయితే అదెంత కాలం అన్నదే ప్రశ్న?

# అమ్మభాషలో చదువుకు ఏఐ దన్ను

ప్రతి మనిషీ అమ్మానాన్న, తోబుట్టువులూ, బంధువులూ, తోటివారితో మాట్లాడే భాషలోనే ప్రకృతినీ సమాజాన్నీ సంస్కృతినీ అర్థం చేసుకుంటాడు. మాతృభాష మనిషికి బలమైన వ్యక్తిత్వాన్ని, జీవన నైపుణ్యాలను అందిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. కానీ ఇంటి భాష, బడి బాష వేరువేరయ్యే సరికి గందరగోళం ఏర్పడుతోంది. ఫలితంగా ఏదీ అర్థంకాక, అన్నింటా వెనకబడాల్సి వస్తోంది.మానవ సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి, సంపద సృష్టితో జీవనం సాగించడానికి మాతృభాష ముఖ్య ఉపకరణంలా పనిచేస్తుంది. మనిషికి జీవించే హక్కు పుట్టుకతో ఎలా వస్తుందో, గౌరవప్రదమైన జీవనానికి వారసత్వంగా వచ్చిన మాతృభాషలో చదువు కూడా అలాంటిదే. అంటే, ఇప్పటి ఆంగ్ల మాధ్యమంతో ఆ ప్రజాస్వామిక హక్కును కోల్పోతున్నామన్నమాటే! ఆంగ్ల మాధ్యమం పేరిట ప్రస్తుత, రాబోయే తరాలకు మాతృభాషను దూరం చేయడం వల్ల తెలుగు సమాజానికి జరిగే నష్టాల గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన సమయమిది. అవసరానికి ఏ భాషనైనా ఒక విషయంగా నేర్చుకోవచ్చు. కానీ ఇంగ్లిష్ మాధ్యమ విద్య ద్వారా తెలుగు తరిగిపోతోంది. దీనివల్ల వ్యక్తికీ, సమాజానికీ జరుగుతున్న నష్టాల గురించి తెలుసుకోవాలి. యువతలో నైపుణ్యాల లేమితో ఇబ్బందిపడుతున్న పరిశ్రమల గురించీ, అక్షరాస్యతలో వెనకబాటుతనం, పెరుగుతున్న నేరప్రవృత్తుల గురించీ యోచించాలి. మాతృభాషలో చదువులు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతతో కూడిన ప్రవృత్తిని పెంచేందుకు తోడ్పడతాయి. వృత్తి ఉద్యోగాల కోసం మార్కులే లక్ష్యంగా చదవడం వల్ల మనుషుల్లో విపరీత ధోరణులు పెరిగిపోతున్నాయి. చదువులు నేర ప్రవృత్తిని తగ్గించాలి కానీ, ఇప్పుడు సమాజంలో నేరాలు ఎక్కువవుతున్నాయి. దీని గురించి మనమొకసారి ఆలోచించాలి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన కొన్ని పరిశోధనలు నేరుగా కాకపోయినా వివిధ విషయాల కలయికతో- ఒక కీలకాంశాన్ని పేర్కొంటున్నాయి. వలస పాలకుల భాషా మాధ్యమ చదువులు మానసిక, సాంస్కృతిక వేర్పాటు భావనను కలిగిస్తాయని, ఇది ప్రత్యేకించి యువతలో అసంతృప్తికి, విస్తృత సామాజిక అశాంతికి దోహదం చేస్తాయని గుర్తించాయి.

## ఆంగ్ల మాధ్యమంపై భ్రమలు

ఆంగ్ల మాధ్యమ విద్యతోనే దేశవిదేశాల్లో ఉద్యోగాలు వస్తాయనే భ్రమ బలపడింది. కానీ, ఏటా లక్షల్లో ఉద్యోగాలు రావాల్సి ఉండగా, వేలల్లోనే లభిస్తున్నాయి. విదేశీ కొలువులైతే ఎక్కువగా అమెరికా నుంచే వస్తున్నాయి. గత రెండేళ్లుగా తరిగిపోతున్న అమెరికా ఉద్యోగావకాశాలు ఇప్పుడు కనీస స్థాయికి చేరుకున్నాయి. తరుగుతున్న విదేశీ ఉద్యోగ అవకాశాలూ, పెరుగుతున్న ఆంగ్ల మాధ్యమ చదువులూ యువతలో నిరాశలను పెంచుతున్నాయి. మాతృభాష మానవ సమాజాలకు ఆర్థిక వెన్నెముక. మన ఆర్థిక వ్యవస్థ కేవలం ఇంగ్లిష్ మీద ఆధారపడి ఉందనేది అపోహ మాత్రమే. భారతదేశ మొత్తం జీడీపీలో దాదాపు 82.73శాతం వాటా మాతృభాషల్లో జరిగే ఆర్థిక కార్యకలాపాల ద్వారానే సమకూరుతోందని అంచనా. సుమారు 17.26శాతం ఆదాయం మాత్రమే ఇంగ్లిష్ వినియోగం ఉన్న రంగాల నుంచి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో 84.52శాతం ఆర్థిక లావాదేవీలు మాతృభాషలోనే సాగుతున్నాయి. మాతృభాషలో విద్యనభ్యసించే దేశాలైన దక్షిణ కొరియా, జపాన్, అమెరికా, చైనా, ఇజ్రాయెల్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, యూకే పేటెంట్ల సాధనలో ముందంజలో ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియంపై అతిగా ఆధారపడుతున్న ఇండియా చాలా వెనకంజలో ఉంది. 2011 గణాంకాల ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత జాతీయ సగటుకన్నా తక్కువ. మాతృభాషలో చదువుకునే అవకాశం తగ్గడమే ఈ వెనకబాటుకు కారణం. ఇంగ్లిష్ అర్థం కాక బడిమానేసే పిల్లల సంఖ్య కూడా పెరుగుతోంది. పట్టభద్రుల్లోనూ చాలామందికి సరైన వృత్తి నైపుణ్యాలు లేవని సర్వేలు చెబుతున్నాయి. ఇదంతా ఆంగ్ల మాధ్యమంతో కలుగుతున్న సామాజిక నష్టం.

పిల్లలు ఇంట్లో అమ్మానాన్నలు, కుటుంబంలోని పెద్దలూ బంధువులూ చెప్పే కథలనూ, వారి అనుభవాలనూ మాతృభాషలో వింటూ సామాజిక వ్యక్తిత్వాన్నీ నడవడికనూ ఏర్పరచుకుంటారు. ఇంటిభాష బడిభాష వేరయ్యేసరికి పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు భాషతోనే కష్టాలు మొదలవుతాయి. ఇంట్లోవారితో బంధుమిత్రులతో గడగడా అమ్మభాషలో మాట్లాడే పిల్లలు, బడిలో ఇంగ్లిష్‌లో టీచరు చెప్పే పాఠాలు పూర్తిగా అర్థంకాక భయపడతారు. ప్రశ్నించడమూ మానుకుంటారు. బడిలోని ఇంగ్లిష్ ఇంట్లోవారికి తెలియకపోవడంతో పిల్లల చదువులతో వారికెలాంటి సంబంధం లేకుండా పోతోంది. చదువులపై చర్చ కూడా ఉండటం లేదు. అటు బడిభాషా రాక, ఇటు తెలుగూ అనర్గళంగా మాట్లాడలేక అయినవారితో మాట్లాడటమూ తగ్గించుకుంటారు. దాంతో కుటుంబ, సామాజిక సంబంధాల్లో క్షీణత తలెత్తుతుంది. ఇంట్లో పెద్దవాళ్లు పంచుకోవాలనుకునే కథలూ, అనుభవాలూ సాంస్కృతిక విషయాలేవీ పిల్లలకు చేరకపోతే వారు మాతృభాషతోపాటు పుట్టిన సంస్కృతికీ, సమాజానికీ, మానవ సంబంధాలకూ దూరమవుతారు. చివరికి ఎవరి లోకంలో వారు ఉండాల్సి వస్తుంది.

**సాంకేతికత సాయంతో...**

ఆధునిక కృత్రిమ మేధ ఆధారిత యంత్రానువాద సాధనాల వల్ల విజ్ఞాన సముపార్జన ఇప్పుడు సులభమైంది. సమాచార లభ్యత తేలికగా మారింది. ప్రపంచంలో ఏ భాషలో ఉన్న సమాచారాన్ని అయినా మాతృభాషలోకి మార్చుకునే వెసులుబాటు వచ్చింది. కాబట్టి విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విషయాలను మాతృభాషలోనే నేర్చుకోవచ్చు. అంతర్జాతీయ సమాచారాన్ని పొందవచ్చు. ఈ పరిణామం కృత్రిమ మేధా యుగంలో ఇంగ్లిష్ అనివార్యతను తగ్గించడంలో కీలకంగా మారుతోంది. కృత్రిమ మేధ ఆధారిత యంత్రానువాద వ్యవస్థలు నేడు ఏ భాష నుంచైనా మరో భాషకు తర్జుమా చేసుకునే వీలు కల్పిస్తున్నాయి. ప్రాచీన గ్రంథాల నుంచి ఆధునిక తెలుగుకూ మరే ఇతర భాషల్లోకైనా అనువదించుకోవడం సులభతరంగా మారింది. ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుంటూ మాతృభాషలో జ్ఞానసముపార్జనకు నవతరానికి అవకాశం కల్పించాలి. అది కుటుంబాల శ్రేయస్సుకూ, దేశ భవిష్యత్తుకూ మేలు చేస్తుంది.

# విధ్వంసకర వరదలు ఎందుకొస్తున్నాయి?

నేపాల్‌ను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. ఏదైనా హిమానీనదం అకస్మాత్తుగా కరిగిపోవడం వల్లే ఈ విధ్వంసం సంభవించిందేమో తెలుసుకోవాలంటే- ఆ ప్రాంత ఉపగ్రహ చిత్రాలు, ఇటీవలి వర్షపాత సమాచారాన్ని పరిశీలించాలి. ప్రాథమిక అంచనా ప్రకారం, ముప్పు తలెత్తిన ప్రాంతంలో 4.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల హిమానీనదం అడుగున పగుళ్లు ఏర్పడి తీవ్రస్థాయిలో ఆకస్మిక వరదలు సంభవించి ఉండవచ్చని తెలుస్తోంది.అమెరికా భూగర్భ సర్వే సంస్థ తాజా అధ్యయనాలు హిమాలయ పర్వతాలలో భారీ హిమపాతం సంభవించి, కొండ చరియలు విరిగిపడటమే నేపాల్ జలప్రళయానికి కారణమని పేర్కొన్నాయి. భూకంపం వల్ల కాకుండా కొండచరియ విరిగిపడటం వల్లే భూప్రకంపన సంకేతం ఏర్పడిందని తెలిపాయి. వర్షపు నీరు కానీ, కరిగిన మంచు నీరు కానీ నేలను, మంచు దిబ్బలను అస్థిరపరచడం వల్ల ఈ విపత్తు ప్రారంభమై ఉండవచ్చు. నేపాల్-చైనా సరిహద్దులోని రసువాగఢీకి ఈశాన్యంగా ఉన్న లిండే నదిలో కొండచరియలు విరిగిపడ్డాయని నేపాల్ జాతీయ విపత్తు నిభాయింపు ప్రాధికార సంస్థ నివేదించింది. హిమాలయాల్లోని మిట్టపల్లాలు సహజంగానే ఇటువంటి ఘటనలకు తావిస్తాయి.

## ప్రమాదంలో 'మూడో ధ్రువం'

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) ప్రకారం, ఈ విపత్తు నేపాల్‌టిబెట్ సరిహద్దు పర్వతాల్లో ప్రారంభమైంది. భారత భూకంపాల అధ్యయన యంత్రాంగం ప్రకారం నేపాల్‌లో టిబెట్ సరిహద్దు సమీపంలోని రసువా ప్రాంతంలో భూమి కంపించింది. దీనివల్ల జిర్క్ హిమానీనదం కూలిపోయి ఉండవచ్చు. దాంతో భారీగా మంచు, మట్టి, రాళ్లు కిందకు పడి, లిండే నది సహజ ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. తదనంతరం నీరు, బురద, రాళ్లు, ఇతర శిథిలాలతో కూడిన వరద త్రిశూలి నది లోయ గుండా ప్రవహించి భారీ విధ్వంసం సృష్టించింది. త్రిశూలి నారాయణి నదిలో కలుస్తుంది, అది భారత్‌లోని బిహార్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది, అక్కడ దీన్ని గండక్‌గా పిలుస్తారు. బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని గండక్ పరీవాహక ప్రాంతం నుంచి ముందుజాగ్రత్తగా వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొత్తంగా నేపాల్‌లో హిమానీనదం కూలిపోవడం, ఆ తర్వాత రాళ్లతో కూడిన హిమపాతం వల్లే వరద సంభవించిందని ఉపగ్రహ చిత్ర విశ్లేషణ ధృవీకరించింది. ఇలాంటి దుర్ఘటనలను హిమానీనద సరస్సుల విస్ఫోటంతో సంభవించిన వరదలుగా పరిగణిస్తారు.

వాతావరణ మార్పులు హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరిగిపోవడానికి దారితీస్తున్నాయి. ఆర్కిటిక్, అంటార్కిటికాల తర్వాత ప్రపంచంలోనే అత్యధిక మంచు నిల్వలను కలిగి ఉన్న ప్రాంతం హిమాలయాలే. అందుకే ఈ పర్వత ప్రాంతాన్ని ప్రపంచానికి 'మూడో ధ్రువం'గా వ్యవహరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ, నిటారుగా ఉన్న కొండవాలులపై శతాబ్దాల నాటి శాశ్వత మంచు పొరలు (పెర్మా ఫ్రాస్ట్) కరగడం ప్రారంభమై, ఆకస్మికంగా శిథిలాల ప్రవాహాలను ప్రేరేపిస్తాయి. మంచు కొండల్లో వరద ఉత్పాతాలు సంభవించడం నేపాల్‌కే పరిమితం కాదు. భారతదేశంలో ఉత్తరాఖండ్‌లో చమోలీ విపత్తు, స్విట్జర్లాండ్‌లో బ్లాటెన్ గ్రామం ధ్వంసం కావడం, జార్జియా పర్వత రిసార్ట్‌లో కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా హిమానీనదాలు వేగంగా క్షీణించి పోతున్నాయనడానికి నిదర్శనం. స్విస్ హిమానీనదం బద్దలైన సమయంలో కచ్చితంగా పనిచేసిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు సకాలంలో ప్రజలను ఖాళీ చేయించి, ప్రాణనష్టాన్ని నివారించడానికి ఉపకరించాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఇప్పుడు నదీ మట్టాలను, భారీ వర్షపాతం, భూకంప ప్రమాదాలను ముందే పసిగట్టి, నిజ సమయంలో పర్యవేక్షించవచ్చు. కానీ, అధిక వ్యయం కారణంగా ఇటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం వర్ధమాన దేశాలకు సవాలు అవుతోంది. నేపాల్‌లో పర్యవేక్షణ సదుపాయాల ఆధునికీకరణకు నిరుడు 'గ్రీన్ క్లైమేట్ ఫండ్' నిధులను కేటాయించడాన్ని ఒక ఆశాకిరణంగా భావించవచ్చు.

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

శుక్రవారం ⁞ అనంతపురం ⁞ 04.09.2026 ⁞ 01


## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని

కుందుర్పి సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరమణ ఆహ్వానం మేరకు పెద్దపల్లి ఆంజనేయస్వామి ఆలయ కళ్యాణమంటపంలో జరిగిన వారి కుమారు డు దేవరాజ్ వెడ్స్ స్రవంతిల వివాహ వేడుకకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , టీడీపీ నాయకులు, అనంత రం అంజన్నను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన ఎమ్మెల్యే అమిలినేని



# పుట్టపర్తి నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని అభివృద్ధి

- రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఐదో తరం యుద్ధ విమాన పరిశ్రమ.. ఆమడగూరులో రూ.51,300 కోట్లతో రిలయన్స్ సౌర విద్యుత్ ప్రాజెక్టు
- 193 చెరువులను కృష్ణా జలాలతో నింపడమే లక్ష్యం : ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి, సెప్టెంబర్ 3:అనంత జనశక్తి న్యూస్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టపర్తి నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో గురువారం నిర్వహించిన ఇంటింటికీ టీడీపీ ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు, టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కూటమి నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, అభివృద్ధి ప్రాజెక్టులు వస్తున్నాయని పేర్కొన్నారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఐదో తరం యుద్ధ విమాన పరిశ్రమకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రాంతానికి రావడం గర్వకారణమన్నారు. అలాగే ఆమడగూరు మండలంలో రూ.51,300 కోట్లతో రిలయన్స్ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు కానుందని, దీనివల్ల భారీ పెట్టుబడులతో పాటు స్థానికంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.



**193 చెరువులకు కృష్ణా జలాలు చేరుస్తా**

పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపడమే తన లక్ష్యమని పల్లె సింధూర రెడ్డి అన్నారు. రాబోయే మూడేళ్లలో ఈ లక్ష్యాన్ని సాధించి రైతులకు బహుమతిగా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కృష్ణా జలాలు చెరువులకు చేరితే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకు రావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**గంగిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే**

ఎనుములపల్లిలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త గోపి తండ్రి గంగిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటూ మందులు సకాలంలో వాడాలని సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పెన్షన్లు, పక్కా ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యేను కోరారు. అర్హులైన వారికి త్వరలో కొత్త పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని, సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పార్వతమ్మ, టీడీపీ మండల కన్వీనర్ బోయ రామాంజనేయులు, గంగాధర్ నాయుడు, సామకోటి ఆదినారాయణ, బెస్త చలపతి, ఓబులేసు, డీసీఆర్, ఉమాపతి, కృష్ణ ప్రసాద్, సురేష్ చౌదరి, జయప్రకాష్, రమేష్, గోవర్ధన్ రెడ్డి, వనిత, రాధమ్మ, పద్మజ, చెన్నకృష్ణమ్మ, రమణమ్మ, గంగాధర్ తదితరులతో పాటు బీజేపీ నాయకులు లాయర్ హరికృష్ణ, సురేంద్ర, సుధాకర్, జ్యోతి ప్రసాద్, నారాయణ రామాంజి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సీఐ యువరాజ్, పోలీసు అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనంతపురంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'



- జిల్లా ఎస్పీ ఆదేశాలతో త్రీటౌన్ పోలీసులు, ఈగల్ సెల్ అధికారులు సంయుక్తంగా విద్యాసంస్థల వద్ద తనిఖీలు
- నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న 4 దుకాణాల యజమానులకు జరిమానాలు

అనంతపురం సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

విద్యాసంస్థల పరిసరాల్లో అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసులు & ఈగల్ సెల్ అధికారులు ఈరోజు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు.నగరంలోని 4వ రోడ్డు ప్రాంతంలో ఉన్న నేతాజీ హైస్కూల్, పీఆర్కే జూనియర్ కాలేజీ, సన్‌షైన్ హైస్కూల్ తదితర విద్యాసంస్థల చుట్టూ 500 మీటర్ల పరిధిలోని 6 కిరాణా దుకాణాలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న 4 దుకాణాల యజమానులకు జరిమానా విధించారు.విద్యాసంస్థల పరిసరాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు జిల్లా 'ఈగల్ సెల్' ఎస్సై హనుమంతు ఆధ్వర్యంలో బృందం పాల్గొన్నారు.

# నారాయణ రత్నం సి బి ఎస్ ఈ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నెల్లూరు సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

నగరంలోని స్థానిక ధనలక్ష్మీపురం నందుగల నారాయణ రత్నం సిబిఎస్ఈ స్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించి, ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీకృష్ణుడికి నీరాజనాలు పలికారు. పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు సందడి చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ఆటపాటలతో ఈ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి .ఈ సందర్బంగా ఏజీఎం రవివర్మ, ప్రిన్సిపాల్ మోపిదేవి నాగమణి కృష్ణాష్టమి పర్వదినం యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. భగవద్గీత లో కృష్ణుని బోధనలు అనుసరణీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తులికా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యార్థుల కృష్ణుడి వేషధారణలు, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలి..

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..
- జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్రాగునీరు అందించాలి.
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత..

అనంతపురం, సెప్టెంబర్ 03 : అనంత జనశక్తి న్యూస్

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం రాప్తాడు నియోజకవర్గంలో త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో చేపట్టిన పనుల పురోగతి, ఎంతవరకు పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలి, తదితర అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. జల జీవన్ పథకం కింద అనంతపురము రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ 40 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.18 కోట్ల పనులు చేశారని, అందులో ఇప్పటివరకు 15 కోట్ల 50 లక్షల రూపాయల బిల్స్ ఇచ్చారని, 2 కోట్ల 50 లక్షలు బిల్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో ఇంకా 22 కోట్ల రూపాయల పనులు చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ 50 కోట్ల 43 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించగా, రూ.38 కోట్ల పనులు చేశారని, వారికి 34 కోట్ల బిల్స్ ఇచ్చారని, ఇంకా 12 కోట్ల 43 లక్షల రూపాయల పనులు చేయాలన్నారు. వారు ఆత్మకూరులో 10 గ్రామాలు, అనంతపురము రూరల్ పరిధిలో 4 గ్రామాలు, రాప్తాడులో 6 గ్రామాలలో పనులు చేస్తున్నారని, 50 శాతం పనులు చేసి మిగిలిన పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయలేదన్నారు. సాయి పావని కాంట్రాక్టర్ వారు 31 గ్రామాలలో (కక్కలపల్లి కాలనీ, పాపంపేట, సజ్జల కాలువ, చిన్నంపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, రాచానపల్లి, S.K.యూనివర్సిటీ చుట్టూ గ్రామాలు వీటితో పాటు 19 గ్రామాలు) పనులు చేస్తున్నారని, ఇందులో 50 శాతం పనులు చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చిన్న చిన్న రిపేర్ ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించి గ్రామాలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర మెయిన్ పైప్ లైన్ 600 మీటర్లు పెండింగ్ లో ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర ఫిల్టర్ బెడ్స్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని, డ్యాం దగ్గర క్లియర్ వాటర్ సంపు నుండి ఆత్మకూరుకు పంపింగ్ చేసే మోటర్లు ఇప్పటివరకు ఆర్డర్ పెట్టలేదని, పి.నారాయణపురం మరియు పి.యాలేరు మధ్య హెచ్.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు పూర్తికాలేదని, 50 శాతం పనులు జరిగాయని, ఆత్మకూరు గ్రామంలో ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ పనులు మరియు సంపు పనులు ఇంకా పూర్తి కాలేదని, పంపురూము మరియు మోటర్లు పనులు కూడా పూర్తి కాలేదని, పంపనూరు మరియు చిన్నంపల్లి దగ్గర కట్టాల్సిన మినీ ట్యాంకుల పనులు కూడా పూర్తి కాలేదని, సత్యసాయి కార్మికులు జీతాలు రావట్లేదని, జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి సరఫరా పనులు వేగవంతంగా చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో విపత్కర పరిస్థితుల్లో జల్ జీవన్ మిషన్ పనులను రెండు నెలలలోగా వేగవంతంగా పూర్తి చేసి 30 గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా పంపింగ్ హౌస్ వద్ద 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంపింగ్ హౌస్ వద్ద కొత్త సాండ్ ఫిల్టర్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ఆర్డర్లను వెంటనే పూర్తి చేసి, రాబోయే 2 నెలల్లో పనులను చేపట్టాలనే లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్ సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రాబోయే 34 రోజుల్లో పేమెంట్లు పూర్తి చేసి, అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలన్నారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు మరియు ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్ఈ / సీఈ స్థాయి అధికారుల నుండి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కురుగుంట మరియు సిండికేట్ నగర్ పరిధిలోని మిగిలి ఉన్న 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలన్నారు.తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, పిఏబిఆర్ డ్యామ్ నుండే మనకు ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉందన్నారు. ప్రతినెల ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి పీఏబిఆర్ దగ్గర 2.5 ఎకరాల భూమి కావలసి ఉండగా, అందులో 75 సెంట్లు ఇవ్వడం జరగగా, ఇంకా 1.75 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, వెంటనే త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దానితో పాటు ఒడ్డుపల్లి సబ్ స్టేషన్ వెనుకాల పిపిటి కట్టేందుకు 10 సెంట్లు కావలసి ఉండగా వెంటనే ఇవ్వాలని రెవెన్యూ అధికారులని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డిఈ శ్రీధర్, ఏఈలు, కాం



# పోషణ వనిత కార్యక్రమానికి ఘనంగా శ్రీకారం

- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం
- 10 మండలాల్లో 10,000 కుటుంబాలకు పోషకాహార అవగాహన
- 100 మంది మహిళలకు స్వయం ఉపాధి & ఆదాయ అవకాశాలు
- స్థానిక చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార రకాల వినియోగానికి ప్రాధాన్యత
- ప్రతి ఇంటికి పోషణ • ప్రతి మహిళకు అవకాశం ప్రతి సమాజానికి ఆరోగ్యం
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, సెప్టెంబర్, 03:అనంత జనశక్తి న్యూస్



శ్రీ సత్యసాయి జిల్లాలో కుటుంబాల పోషకాహార స్థాయిని మెరుగుపరచడం, స్థానిక ఆహార వైవిధ్యాన్ని ప్రోత్సహించడం మరియు మహిళలకు పోషణ ఆధారిత జీవనోపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన "పోషణ వనిత" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గురువారం ఘనంగా ప్రారంభించారు.గణేష్ సర్కిల్ లోని సాయి ఆరామం నందు నిర్వహించిన ఈ ప్రారంభోత్సవంలో డిఆర్‌డిఏ పిడి నర్సయ్య, వాసన్ (WASSAN) అసోసియేట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాముఖ్యత, లక్ష్యాలు మరియు అమలు విధానంపై కలెక్టర్ వివరాలను వెల్లడించారు.

**1. పోషకాహార అవగాహన – ఆచరణ:**

పోషణ వనిత కార్యక్రమం కేవలం సమాచార ప్రచారానికే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ ఆహారపు అలవాట్లలో ప్రత్యక్ష మార్పు తేవడానికి కృషి చేస్తుంది. ప్రతి కుటుంబానికి వారి అవసరాలకు తగిన పోషకాహార సూచనలను ఆచరణాత్మకంగా అందిస్తారు.

**2. స్థానిక ఆహార రకాలకు ప్రాధాన్యత:**

మన ప్రాంతంలో సహజంగా దొరికే పోషక విలువలున్న ఆహార ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహిస్తారు.చిరుధాన్యాలు (Millet), పప్పు ధాన్యాలు, సంప్రదాయ వరి రకాలు.స్థానిక కూరగాయలు మరియు నాటు ఆకుకూరలు.

**3. మహిళలకు ఆదాయం & స్వయం ఉపాధి:**

**స్థానికంగా ఉండే మహిళలను 'పోషణ వనిత'లుగా ఎంపిక చేస్తారు. వీరు గ్రామీణ కుటుంబాలకు పోషణపై మార్గదర్శనం చేయడమే కాకుండా, పోషకాహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, విలువ జోడింపు (Value Addition), మరియు విక్రయాల ద్వారా స్వయం ఉపాధి పొందుతారు.**

**ప్రణాళిక & లక్ష్యాలు (3 ఏళ్ల కార్యాచరణ),జిల్లాలోని 10 మండలాల్లో 10,000 కుటుంబాలను తొలి విడతలో కవర్ చేయడం.వచ్చే 3 ఏళ్లలో 100 మంది మహిళలను 'పోషణ వనితలు'గా తీర్చిదిద్ది వారికి శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం.గ్రామస్థాయిలో ఆహార ఉత్సవాలు, వంటకాల ప్రత్యక్ష శిక్షణలు, నిపుణుల సలహాలు, అవగాహన సదస్సులు నిర్వహించడం.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి SERP, మహిళా & శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు WASSAN సంస్థ మరియు గ్రామ సమైక్యలు కలిసికట్టుగా పనిచేస్తాయి. "ప్రతి ఇంటికి పోషణ • ప్రతి మహిళకు అవకాశం • ప్రతి సమాజానికి ఆరోగ్యం" అనే నినాదంతో గ్రామీణ స్థాయిలో స్థిరమైన, స్వయం ఆధారిత ఆహార భద్రతా వ్యవస్థను నిర్మించడమే పోషణ వనిత ముఖ్య ధ్యేయం.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నరసయ్య,ఎల్డిఎమ్ ఫనింద్ర కుమార్,ఐసిడిఎస్ పిడి ప్రమీల,వ్యవసాయం డిఎఓ కృష్ణయ్య,డిప్యూటీ డిఎం&హెచ్ఓ సునీల్ మరియూ ఇతర అధికారులు పాల్గొన్నారు.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం
04.09.2026


## ఎస్ఐఆర్ లో విచారణలు వేగవంతంగా పూర్తి చేస్తాం..



**- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.**

**అనంతపురం, సెప్టెంబర్ 03 :అనంత జనశక్తి న్యూస్**

అమరావతి, వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) 2026పై జిల్లా కలెక్టర్లు & జిల్లా ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ సమీక్ష నిర్వహించారు.అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా.. విచారణలకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1,22,601 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, రాబోయే 10 రోజుల్లో విచారణలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి రోజు 12 వేల వరకు విచారణలు చేపడుతున్నామని తెలిపారు. పార్క్డ్ ఫర్ ఫైనల్ పబ్లికేషన్ కు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 11 లక్షల దరఖాస్తులను పార్కింగ్ చేయగా, మిగిలిన 3 నుండి 4 లక్షల దరఖాస్తులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఫారమ్ 6కు సంబంధించి 11,327 దరఖాస్తులు, ఫారమ్ 7కు సంబంధించి 242 దరఖాస్తులు, ఫారమ్ 8కు సంబంధించి 9,044 దరఖాస్తులను ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. 48 గంటల కంటే ఎక్కువ సమయం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఏవీ లేకుండా 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. NGSPలో పెండింగ్‌లో ఉన్న 15 ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అనంతపురం అర్బన్ మరియు తాడిపత్రి నియోజకవర్గాల్లో పెండెన్సీ ఎక్కువగా ఉన్నందున, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి రాబోయే 10 రోజుల్లో అన్ని ప్రక్రియలను పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు..

## పారదర్శకతకు పెద్ద పీట వేసి..పేద కుటుంబాలకు అండగా నిలిచాం..ఎమ్మెల్యే అమిలినేని



**- వైసీపీ ప్రభుత్వంలో పోస్టును బట్టి డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకున్నారు..**
**- పేద ప్రజలకు అండగా నిలిచి వారికి సేవ చేసేందుకు మా ప్రభుత్వం మేము పనిచేస్తున్నాం**
**- ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసి ఎక్కడా ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేద కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి వారికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదికలో కంబదూరు, కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ ల పరిధిలోని 38 మందికి అంగన్వాడీ ఆయాలుగా ఉద్యోగ నియామకాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా ఉండి అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు రేటు పెట్టి మరి పేదలతో ఆడుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సంస్కృతికి తెరదించి పారదర్శకతకు పెద్ద పీట వేసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో పేద ప్రజలకు అండగా నిలబడటం కోసం పనిచేస్తున్నామని తెలిపారు..ఎక్కడ ఏ ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, పేద కుటుంబాలకు ఉద్యోగాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు..ఎలాంటి పొరపాట్లకు, చిన్నారులకు సక్రమంగా అన్ని అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఉద్యోగాలు పొందిన వారికి సూచించారు...

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న సాకే ధీరజ్

**- అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు**
**- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ధీరజ్**
**- 2 సంవత్సరాల 8 నెలల వయసులో 1,152 మీటర్ల రోడ్ స్కేటింగ్ ఫీట్**

**అనంతపురం, సెప్టెంబర్ :03 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం నగరానికి చెందిన రెండున్నర ఏళ్ల చిన్నారి ధీరజ్ సాకే అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించి జిల్లా ఖ్యాతిని చాటాడు. ప్రఖ్యాత అంతర్జాతీయ రికార్డు సంస్థ "ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (International Book of Records) నిర్వహించిన ప్రతిభా విభాగంలో ధీరజ్ సాధించిన అద్భుతమైన స్కేటింగ్ ఫీట్‌కు గుర్తింపుగా "సూపర్ టాలెంటెడ్ కిడ్" (SUPER TALENTED KID) మరియు "వన్ ఇన్ ఏ మిలియన్" (ONE IN A MILLION) బిరుదులతో కూడిన అధికారిక రికార్డు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఈరోజు అనంతపురం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఐఏఎస్ ని ధీరజ్ తన తల్లిదండ్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్నారి ప్రతిభను స్వయంగా అభినందించిన కలెక్టర్, ధీరజ్‌కు మెడల్ తొడిగి, అధికారిక సర్టిఫికేట్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఇంత చిన్న వయసులోనే కఠినమైన రోడ్ స్కేటింగ్‌లో రికార్డు సాధించడం గర్వకారణమని కలెక్టర్ ప్రశంసించారు.

**రికార్డు వివరాలు:**
కేవలం 2 సంవత్సరాల 8 నెలల వయసు కలిగిన మాస్టర్ సాకే ధీరజ్, క్వాడ్ స్కేట్స్ (Quad Skates) సహాయంతో రోడ్డుపై నిరంతరాయంగా 1,152 మీటర్ల దూరాన్ని కేవలం 11 నిమిషాల 50 సెకన్లలో పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చిన్నారి చూపిన అసాధారణమైన శారీరక దృఢత్వం, ఏకాగ్రత మరియు వేగాన్ని గుర్తించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కమిటీ ధీరజ్ పేరును అధికారిక రికార్డుల జాబితాలో నమోదు చేసి ఈ అవార్డును ప్రదానం చేసింది. భవిష్యత్తులో ధీరజ్ మరింతగా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ అవార్డు రావడానికి ప్రోత్సహించిన ఆశ్రా రోలర్ స్కేటింగ్ అకాడమీ కోచ్ అంజి మరియు కుటుంబ సభ్యులను కలెక్టర్ అభినందించారు.



# అనంతపురం పోలీసుల ఘన విజయం..

**- 15 వేల మొబైల్ ఫోన్లు రికవరీ**
**- రూ.30.49 కోట్ల విలువైన 15,004 ఫోన్లు స్వాధీనం.. బాధితుల ఇళ్ల వద్దకే 583 ఫోన్ల అందజేత**

**అనంతపురం సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో అనంతపురం జిల్లా పోలీసులు మరో ఘన విజయం సాధించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ప్రత్యేక దృష్టితో ఇప్పటి వరకు రూ.30.49 కోట్ల విలువైన 15,004 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ప్రారంభించిన 'మీ మొబైల్-మీ ఇంటికి' కార్యక్రమంలో భాగంగా సోమవారం బాధితుల ఇళ్ల వద్దకే రూ.1.22 కోట్ల విలువైన 583 మొబైల్ ఫోన్లను సీఐలు, ఎస్సైలు, గ్రామ పోలీసు అధికారులు అందజేశారు. దీంతో తమ ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. చాట్‌బాట్, సీఈఐఆర్ ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లను గుర్తిస్తున్నామని తెలిపారు. ఐఎంఈఐ ఆధారిత అన్వేషణ, సాంకేతిక పరిశోధన, సైబర్ విభాగం సహకారంతో ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. ప్రజల ఆస్తుల రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల అత్యున్నత బాధ్యత అన్నారు. 'మీ మొబైల్-మీ ఇంటికి' కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు.

**ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ**
పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ కోసం 2022 జూన్ 26న ప్రత్యేక చాట్‌బాట్ సేవలను ప్రారంభించడంతో ఫోన్ల స్వాధీనం, పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతమైందని పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు దేశంలోని ఇతర 20 రాష్ట్రాల నుంచి 1,203 ఫోన్లు, రాష్ట్రంలోని ఇతర 18 జిల్లాల నుంచి 2,863 ఫోన్లు రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్ల విలువ రూ.499 నుంచి రూ.1.41 లక్షల వరకు ఉన్నట్లు తెలిపారు. మొబైల్ దొంగతనం కేసులకు సంబంధించి అనంతపురం వన్‌టౌన్, కళ్యాణదుర్గం అర్బన్, గుంతకల్లు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముగ్గురు మొబైల్ దొంగలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

**మొబైల్ కొనుగోలులో జాగ్రత్తలు అవసరం**
తెలియని వ్యక్తుల నుంచి, ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రుల వద్ద మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని పోలీసులు సూచించారు. బిల్లు, బాక్స్ లేని ఉపయోగించిన ఫోన్లను కొనుగోలు చేయకుండా ఉండాలని తెలిపారు.
సెకండ్‌హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే ముందు సిమ్ కార్డు స్లాట్లను పరిశీలించి ఫోన్ పనితీరును తనిఖీ చేయాలని సూచించారు. సరైన పత్రాలు లేకుండా అనుమానాస్పద వ్యక్తులు మొబైల్ ఫోన్లు విక్రయించేందుకు ప్రయత్నిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని మొబైల్ షాపు యజమానులకు సూచించారు.

# కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన శ్రీ పవన్ కళ్యాణ్



**- ఎ.కొండూరుకు జేజేఎం–అమరజీవి జలధారలు**
**- ఉద్ధానం తరహా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**
**- గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ప్రాజెక్టుకు ప్రాణం పోసిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**
**- 26 నెలల కాలంలో రూ. 49.94 కోట్ల పనులు పూర్తి**
**- 38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్**

**ఇంటింటికీ కుళాయిలతో దాదాపు 75,000 మందికి స్వచ్ఛమైన తాగునీరు**

**విజయవాడ సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్ధానాన్ని తలపించే ప్రాంతం ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండలం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది.

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ. 49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది.గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించ లేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది. కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రివర్యులు, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహింపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి, అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75,000 మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పవన్ కళ్యాణ్ , గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు.గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ. 2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. నేడు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, తద్వారా కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి తాగునీటి పథకం పనుల నాణ్యతను ఉప ముఖ్యమంత్రివర్యులు పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.



# ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

**- మంత్రి కందుల దుర్గేష్**
**- సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ సమావేశం..పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా సుదీర్ఘ చర్చ**

**అమరావతి సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన టూరిజం డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ మీటింగ్ లో ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా జిల్లా స్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు.. జిల్లాల నుండి అందిన 28 ప్రతిపాదనలకు అనుగుణంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు రూపకల్పన చేయాలన్నారు. సెప్టెంబర్ 27న 'వరల్డ్ టూరిజం డే' వేడుకల నిర్వహణ, రాబోయే గోదావరి పుష్కరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ తరఫున అత్యాధునిక టెంట్ సిటీల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశవిదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులు, పర్యాటకుల కోసం రూపొందించిన విస్తృత స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యాచరణను అధికారులు మంత్రి దుర్గేష్ కు అందించారు. యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, సర్క్యూట్ మ్యాప్స్, ఆకర్షణీయమైన బ్రోచర్లు, సమగ్ర వివరాలతో కూడిన కంటెంట్ తయారు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రాశస్త్యాన్ని,పరివాహక ఆధ్యాత్మిక ప్రాంతాల ప్రాధాన్యతను, చారిత్రక ఘాట్ల విశిష్టతను చాటేలా వినూత్న డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా ప్రచారాలు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. టూర్ ఆపరేటర్లతో ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, హోటల్ అండ్ హాస్పిటాలిటీ వర్క్‌షాప్‌ల ఏర్పాటుపై అధికారులు సూచించగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్‌శెట్టి రవిసుభాష్, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, సినిమాటోగ్రఫీ ఎండీ విశ్వనాథన్, ఏపీటీఏ సీఈవో శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, చీఫ్ మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులు పద్మారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జనపనార ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పించాలి

**– ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్**

**అనంతపురము, సెప్టెంబర్ 3,**
**అనంత జనశక్తి న్యూస్**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితమైన జనపనార (జూట్) ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్ పేర్కొన్నారు.పెరికే ఫౌండేషన్ చైర్మన్ వరప్రసాదరావు బుధవారం ఉపకులపతిని మర్యాదపూర్వకంగా కలసి పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, జనపనార ఉత్పత్తుల ప్రోత్సాహం తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ అధిక వినియోగం వల్ల కలిగే పర్యావరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'క్లీన్ అండ్ గ్రీన్ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

**100 మంది మహిళలు, యువతులకు జనపనార బ్యాగుల తయారీ శిక్షణ**
అనంతపురంలో సుమారు 100 మంది మహిళలు, యువతులకు జనపనార బ్యాగులు, ఇతర జనపనార ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడానికి పెరికే ఫౌండేషన్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక కార్యక్రమాల సహకారంతో ఈ శిక్షణ నిర్వహించి మహిళలకు స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు.క్యాన్సర్ నివారణ, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల గురించి కూడా ఉపకులపతికి వివరించారు.ఈ కార్యక్రమాలను ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్ అభినందిస్తూ, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, ఔత్సాహికతకు విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఎస్కేయూ-పెరికే ఫౌండేషన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ అవగాహన, సామాజిక సేవా కార్యక్రమాల్లో సహకార అవకాశాలపై చర్చించారు.



# సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న టీడీపీ ధర్మవరం ఇంచార్జ్



**ధర్మవరం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ చిలకం మధుసూదన రెడ్డి నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులు చిలకం జయవర్ధన్ రెడ్డి-శ్రావ్యా రెడ్డిలను పరిటాల శ్రీరామ్ ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆయన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలకం కుటుంబ సభ్యులు పరిటాల శ్రీ రామ్‌ను ఆత్మీయంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# ఏపీలో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడుల వెల్లువ

- రాష్ట్రంలో రూ.300 కోట్ల పెట్టుబడులకు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ప్రతిపాదన
- భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో ఎం ఆర్ ఓ ఏర్పాటుకు మెల్‌స్టార్ ఏవియేషన్ ఆసక్తి
- పెట్టుబడిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. సుస్థిర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొందని మంత్రి పేర్కొన్నారు.అమరావతి సచివాలయంలోని ఆర్ & బీ, ఐ & ఐ శాఖ కార్యాలయంలో నేడు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ డైరెక్టర్ వివేక్ అగర్వాల్, ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించింది. రాష్ట్రంలోని వివిధ పోర్టుల్లో సరుకు నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, రైల్వే లింక్డ్ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌లను అభివృద్ధి చేసేందుకు సంస్థ ప్రతినిధులు తమ ఆసక్తిని మంత్రికి వివరించారు.

**ఏపీలో రూ.300 కోట్ల పెట్టుబడులకు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ ఆసక్తి**

సుమారు 30 ఏళ్ల అనుభవం, రూ.1,500 కోట్ల టర్నోవర్ కలిగిన శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిందని మంత్రి తెలిపారు. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ రంగంలో సేవలందిస్తున్న సంస్థ, ఏపీలో పోర్టులు, రైల్వే కనెక్టివిటీ, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి అవకాశాలను పరిశీలిస్తోంది.లాజిస్టిక్స్ రవాణా ఖర్చులను తగ్గించడంతో పాటు రాష్ట్రంలో రవాణా, మౌలిక వసతులు, లాజిస్టిక్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు



చేసిన *ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (APLINK)*పై సంస్థ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు. పెట్టుబడుల ఆకర్షణకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను వారు అభినందించారు.పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రితో జరిగిన చర్చలు సానుకూలంగా సాగడంపై సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

**ఏపీలో ఏవియేషన్ రంగానికి భారీ అవకాశాలు**

అదేవిధంగా, మెల్‌స్టార్ ఏవియేషన్ సంస్థ డైరెక్టర్ తరుణ్ కశ్యప్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్న Melstarr Aviation Learning Academy (MALA) లో పైలట్ శిక్షణ కేంద్రం పురోగతిని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ శిక్షణ కేంద్రానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. విజయవాడ విమానాశ్రయంలో Aircraft Maintenance Engineering (AME) శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. అంతేకాకుండా భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో పూర్తి స్థాయి Maintenance, Repair and Overhaul (MRO) కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది.రాష్ట్రంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల విస్తరణతో పాటు ఎమ్మార్వో, ఏ ఎం ఈ, పైలట్ శిక్షణ వంటి అనుబంధ రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు విమానయాన రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.

**నూతన ఏవియేషన్ పాలసీపై ప్రశంసలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఏవియేషన్ పాలసీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు.ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగానికి పెరుగుతున్న డిమాండ్, అందుబాటులోకి వస్తున్న ఆధునిక విమానాశ్రయాలు, అనుకూలమైన పారిశ్రామిక విధానాలతో గ్లోబల్ స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షితమవుతున్నాయని పేర్కొన్నారు.పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు రావాలని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులను మంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ రంగ అభివృద్ధికి, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మార్వో , ఏ ఎం ఈ, పైలట్ శిక్షణ వంటి రంగాల ద్వారా స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని మంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు, అనుకూలమైన విధానాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

# విశాఖపట్నం వేదికగా సెప్టెంబర్ 10 నుండి 12 వరకు 41వ ఐఏటీఓ జాతీయ వార్షిక సదస్సు: పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

- రాష్ట్ర పర్యాటక రంగ వర్గాలకు ఐఏటీఓ సభ్యత్వం, రిజిస్ట్రేషన్ రుసుముల్లో బంపర్ రాయితీలు
- ఏపీ భాగస్వాములకు రూ. 10,000 ఐఏటీఓ ప్రవేశ రుసుము పూర్తి మినహాయింపు
- సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 8,500 నుండి రూ. 3,000 లకు తగ్గింపు
- రాష్ట్ర పర్యాటక ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పిలుపు

**అమరావతి సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, స్థానిక పర్యాటక భాగస్వాములకు జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 10 నుండి 12 వరకు జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ వార్షిక సదస్సు విశేషాలను వివరించారు.దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, హోటల్ నిర్వాహకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్ర పర్యాటక రంగానికి దక్కిన గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068 కి పైగా సభ్యులతో ఇన్‌బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ, ఏపీ పర్యాటక భాగస్వాముల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించిందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టూర్ ఆపరేటర్లు, హోటళ్ళు, పర్యాటక భాగస్వాములు ఐఏటీఓ సభ్యత్వం పొందేందుకు చెల్లించాల్సిన రూ. 10,000 (+జీఎస్టీ) వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును పూర్తిగా రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31 వరకు అందజేసే దరఖాస్తులకు వర్తిస్తుందని వివరించారు.సాధారణంగా ఐఏటీఓ సభ్యులకు రూ. 6,000, సభ్యులు కానివారికి రూ. 8,500 ఉండే సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఏపీ ప్రతినిధులకు కేవలం రూ. 3,000కే నిర్ణయించామన్నారు.అర్హులైన స్థానిక పర్యాటక ప్రతినిధులు ఎటువంటి ప్రాథమిక ప్రవేశ రుసుము చెల్లించకుండా ఐఏటీఓ అధికారిక పోర్టల్ https://iato.in/Register/form ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఈ సదస్సుకు దేశ నలుమూలల నుండి 1,000 మందికి పైగా ప్రముఖ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్లు, డొమెస్టిక్ ట్రావెల్ కంపెనీలు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, హోటల్ రంగ ప్రతినిధులు, విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని దీనివల్ల ఏపీలోని హోటళ్ళు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలను జాతీయ స్థాయిలో ఉచితంగా ప్రచారం చేసుకోవడంతో పాటు, దేశంలోని అగ్రగామి టూర్ ఆపరేటర్లతో నేరుగా వ్యాపార సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం లభిస్తుందని మంత్రి దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలోని హోటళ్ళు, రిసార్టుల యాజమాన్యాలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, హోమ్‌స్టే నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, టూరిస్ట్ గైడ్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలందరూ ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐఏటీఓ సభ్యత్వం పొందడంతో పాటు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర సహకారంతో ఏపీని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు.

# వరల్డ్ టూరిజం డే సందర్భంగా అవార్డులకు పర్యాటక శాఖ దరఖాస్తుల ఆహ్వానం

- మొత్తం 38 విభాగాల్లో 46 పురస్కారాలు.. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబరు 18 తుది గడువు
- సెప్టెంబరు 27న రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్టత పురస్కారాలు-2025-26 ప్రదానం
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

సెప్టెంబర్ 27న అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్టత పురస్కారాలు202526 ('State Annual Tourism Excellence Awards) ప్రదానం చేయనున్నట్లు వెలగపూడి సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ప్రకటించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పర్యాటకుల అనుభవాలను మెరుగుపరచడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం,సాంకేతికతను జోడించడాన్ని ఉద్దేశించి "డిజిటల్ ఎజెండా మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పర్యాటకరంగ పునర్నిర్మాణం"(Digital Agenda and Artificial Intelligence to redesign tourism) అనే థీమ్‌తో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో రాష్ట్రంలో పర్యాటక, ఆతిథ్య, ప్రయాణ రంగాలలో అంకితభావంతో సేవనందిస్తున్న భాగస్వాములను ప్రోత్సహించడం, వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని,నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడం లక్ష్యంగా పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్లాసిఫైడ్ హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటక ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, గైడ్లు, రచయితలు, ఫిల్మ్ మేకర్లు, డిజిటల్ క్రియేటర్లకు ప్రాతినిధ్యం కల్పిస్తూ మొత్తం 38 విభాగాలలో 46 పురస్కారాలను అందించనున్నామన్నారు.ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో సాధించిన పురోగతి, పర్యాటకుల రాక, ఆదాయం, సేవా నాణ్యత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకుల సంతృప్తి ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తామన్నారు. 'ఎకోఫ్రెండ్లీ హోటల్', 'బెస్ట్ బీచ్' (బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలు) విభాగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అలాగే, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, డిజిటల్ క్రియేటర్ల సేవలను ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 18న సాయంత్రం 5 గం.ల వరకు తుది గడువు ఉంటుందని,గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవు అన్నారు. దరఖాస్తులను నేరుగా లేదా పోస్ట్ ద్వారా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు పంపించాలని వెల్లడించారు. నిర్ణీత నమూనాలో దరఖాస్తు ఫారమ్ నింపడంతో పాటు సాధించిన విజయాలపై 100 పదాలకు మించకుండా చిన్న నివేదిక, కనీసం ఒక హైరిజల్యూషన్ ఫోటోగ్రాఫ్ తో కూడిన పత్రాలను పెన్ డ్రైవ్ లో ఇవ్వొచ్చని తెలిపారు..



దరఖాస్తు ఫామ్ సహా మరిన్ని వివరాలకు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ అధికారిక వెబ్‌సైట్ www.aptourism.gov.inను సందర్శించాలని వివరించారు. ప్రాంతీయ సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక రంగాలలో పర్యాటక రంగ ప్రాధాన్యతను చాటిచెప్పడానికి, 1970లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక

# గోపికల సందడిలో కృష్ణుడి లీలలు



- కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా.....
- కృష్ణుడి వేషధారణలో చిన్నారుల అలరారం.. "దుష్టశిక్షణ–శిష్టరక్షణ" సందేశం....

**ధర్మవరం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకుంటూ, శ్రీకృష్ణుని పాటలకు నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. చాంద్ బాషా మాట్లాడుతూ, "దుష్టశిక్షణ-శిష్టరక్షణ" అనే శ్రీకృష్ణుడి జీవన సందేశాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు పి. నాగభూషణం, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా కృష్ణాష్టమి సంబరాలను జరుపుకున్నారు. చిన్నారుల కృష్ణ, గోపిక వేషధారణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# నిత్యావసర ధరల మంట పై కేతిరెడ్డి ఫైర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై తీవ్ర విమర్శలు....
- మార్టుల్లో సరుకుల ధరలు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే..
- సామాన్యులపై పెరుగుతున్న ధరల భారం పై ఆవేదన....

**ధర్మవరం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరం పట్టణంలోని మోర్, పవిత్ర మార్టులను సందర్శించిన ఆయన బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయలు తదితర నిత్యావసర సరుకుల ధరలను పరిశీలించారు. ఆయా వస్తువుల ధరలు సామాన్యులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలపై ఎంత మేరకు భారం మోపుతున్నాయో పరిశీలించారు. "ఏం కొనాలి.. ఏది తినాలి?" అంటూ సామాన్య ప్రజల పరిస్థితి పై కేతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రోజు రోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో కుటుంబాలను నడిపించడం పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతోందని అన్నారు. ధరల పెరుగుదలకు యుద్ధాలను కారణంగా చూపడం సరికాదని కేతిరెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమని ఆయన విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న ఆదాయం ఎటు వెళ్తోందని ప్రభుత్వాలను ప్రశ్నించారు. దేశంలోని ప్రజా ఆస్తులు, వనరులను విక్రయించే విధానాలు కొనసాగుతున్నాయని ఆరోపించిన కేతిరెడ్డి.. "దేశాన్ని అమ్మకానికి పెడుతున్నారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల పై యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. "యువత మేలుకోవాలి.. ప్రజలు ప్రభుత్వాల విధానాలను ప్రశ్నించాలి" అని కేతిరెడ్డి అన్నారు. నిత్యావసర ధరల పెరుగుదలపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వాలు గుర్తించి, ధరలను నియంత్రించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



# పోలీసుల మెరుపుదాడి

- కార్డెన్ అండ్ సెర్చ్‌తో కాలనీల్లో హైఅలర్ట్..
- 87 వాహనాలు సీజ్.. రౌడీషీటర్లకు ఎస్పీ వార్నింగ్.....

**ధర్మవరం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో పోలీసులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. రానున్న గణేష్ ఉత్సవాలు, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పర్యవేక్షణలో ఎర్రగుంట్ల, లక్ష్మీ చెన్నకేశవ, మహాత్మాగాంధీ కాలనీల్లో గురువారం భారీ స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

"ముందు జాగ్రత్తే మేలు" అన్నట్టుగా పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇళ్లను, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, అక్రమ మద్యం, అక్రమంగా నిల్వ ఉంచిన క్రాకర్స్ తదితరాల కోసం విస్తృతంగా సోదాలు నిర్వహించారు.



**87 వాహనాలు సీజ్.. క్రాకర్స్ స్వాధీనం...**

తనిఖీల్లో సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, 11 ఆటోలు, ఒక కారును పోలీసులు సీజ్ చేశారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలను సమర్పించిన వాహనదారులకు నిబంధనల మేరకు వాహనాలను తిరిగి అప్పగిస్తామని ఎస్పీ తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాల విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**రౌడీషీటర్ల ఇళ్లకు ఎస్పీ స్వయంగా.....**

కార్డెన్ సెర్చ్‌లో భాగంగా 13 మంది రౌడీషీటర్లు, ఆరుగురు సస్పెక్ట్ షీటర్ల ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ స్వయంగా వారితో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే సమయంలో మంచి ప్రవర్తనతో నేరాలకు దూరంగా ఉంటే నిబంధనల మేరకు రౌడీషీట్ తొలగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

**అద్దె ఇళ్లు ఇస్తున్నారా? వివరాలు తెలుసుకోండి....**

కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, నేర కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కాలనీల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పోలీసుల బీట్ పెట్రోలింగ్‌కు ప్రజలు సహకరించాలని సూచించారు. నంబర్ ప్లేట్లు, నేమ్‌బోర్డులు లేని ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

**102 మంది పోలీసులతో ఆపరేషన్.....**

ధర్మవరం డీఎస్పీ జగన్నాథ్ రాజుతో పాటు ఐదుగురు సీఐలు, ఎస్ఐలు, మొత్తం 102 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఇప్పటికే హిందూపురం,
కదిరి ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించామని, పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

"ప్రజలు -పోలీసులు సమన్వయంతో పనిచేసినప్పుడే నేరాలను సమర్థవంతంగా నియంత్రించి సురక్షిత వాతావరణాన్ని కల్పించగలం" అని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు.

## సాక్షాత్తు బ్రహ్మదేవుడు జరిపే ఉత్సవాలు

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు



- అధిక మాసం కారణంగా కనులవిందుగా రెండు బ్రహ్మోత్సవాలు.
- సెప్టెంబరు 08న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14న అంకురార్పణ.

**తిరుమల సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

తిరుమల కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాలలో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి.

పౌరాణిక నేపథ్యం:

పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. స్వామివారి ఆజ్ఞ ప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనందనిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యామాసం(ఆశ్వయుజం) లోని శ్రవణ నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అందువల్లే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటినుండి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

అధికమాసం ప్రాధాన్యత :

చాంద్రమానం ప్రకారం ప్రతి మూడో ఏటా అధిక మాసం వస్తూ ఉంటుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్ద తేడా లేదుగానీ, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది అధికమాసం ఉన్నకారణంగా సెప్టెంబరు 15నుండి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి 12 గంటల వరకు జరుగుతుంది.

**కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (8-09-2026) (ఉదయం 6 నుండి 11 గంటల వరకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంత ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేస్తారు.

**అంకురార్పణం(14-09-2026)(రాత్రి 7 నుండి 8 గంటల వరకు)**

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు. శ్రీస్వామివారి సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంతమండపానికి ఊరేగింపుగా వెళతారు. అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ మన్నులో 9 రకాల వివిధ ధాన్యాలను నాటుతారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయింది.

**ధ్వజారోహణం(15-09-2026)(సా|| 6.21 నుండి 6.35 గంటల వరకు)**

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు.

ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఇలా ఉంది.

పెద్దశేషవాహనం(15092026)(రాత్రి 9గంటలకు)

మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై(పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహిస్తారు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడుగా, ద్వాపరయుగంలో బలరాముడుగా శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితంగా ఉన్నవాడు శేషుడు. శ్రీవైకుంఠంలోని నిత్యసూరులలో ఇతడు ఆద్యుడు, భూభారాన్ని వహించేది శేషుడే. శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం. ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుండి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తాయి.

**చిన్నశేషవాహనం(16-09-2026)(ఉదయం 8 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకిగా భావిస్తారు. శ్రీవైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేషవాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తే భక్తులకు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి.

హంస వాహనం(16092026)(రాత్రి 7 గంటలకు)

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంసవాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమిస్తారు. బ్రహ్మవాహనమైన హంస పరమహంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. అందుకే ఉపనిషత్తులు హంసను పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా భక్తులలో అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని(శరణాగతి) కలిగిస్తాడు.

**సింహ వాహనం(17-09-2026)(ఉదయం 8 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారి దశావతారాల్లో నాలుగవది నరసింహ అవతారం కావడం సింహం గొప్పదనాన్ని తెలియజేస్తోంది. యోగశాస్త్రంలో సింహం బలానికి(వహనశక్తి), వేగానికి(శీఘ్రగమన శక్తి) ఆదర్శంగా భావిస్తారు. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగినప్పుడు - భగవంతుడు అనుగ్రహిస్తాడు అని వాహనసేవలో అంతరార్థం.



**ముత్యపుపందిరి వాహనం(17-09-2026)(రాత్రి 7 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాలకింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది.

**కల్పవృక్ష వాహనం(18-09-2026)(ఉదయం 8 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. క్షీరసాగరమథనంలో ఉద్భవించిన విలువైన వస్తువుల్లో కల్పవృక్షం ఒకటి. కల్పవృక్షం నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. కల్పవృక్ష వాహన దర్శనం వల్ల కోరిన వరాలను శ్రీవారు అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం.

**సర్వభూపాల వాహన వైశిష్ట్యం(18-09-2026) (రాత్రి 7 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. సర్వభూపాల అంటే విశ్వానికే రాజు అని అర్థం. అంటే శ్రీవారు సకల దిక్పాలకులకు రాజాధిరాజని భావం. తూర్పుదిక్కుకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణానికి యముడు, నైరుతికి నిరృతి, పశ్చిమానికి వరుణుడు, వాయువ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులుగా విరాజిల్లుతున్నారు. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై, హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారు అనే సందేశాన్ని ఈ వాహనాన్ని అధిరోహించడం ద్వారా స్వామివారు తెలియజేస్తున్నారు.

**మోహినీ అవతారం (19-09-2026)(ఉదయం 8 గంటలకు)**

బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తాడు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. ప్రపంచమంతా తన మాయావిలాసమని, తనకు భక్తులైనవారు ఆ మాయను సులభంగా దాటగలరని మోహినీ రూపంలో ప్రకటిస్తున్నాడు.

**గరుడ వాహనం(19-09-2018)(సాయంత్రం 6.30 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధులలో నింపాదిగా విహరిస్తూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తాడు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. దాస్య భక్తితో కొలిచే భక్తులకు తాను దాసుడినవుతానని గరుడవాహనం ద్వారా స్వామివారు తెలియజేస్తున్నాడు. మానవులు జ్ఞాన వైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని స్వామివారు భక్తకోటికి తెలియజెప్పుతున్నాడు.

**హనుమంత వాహనం(20-09-2026)(ఉదయం 8 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. గురుశిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వవివేచన తెలిసిన మహనీయులు కావున ఈ ఇరువురినీ చూసిన వారికి వేదాలతత్త్వం ఒనగూరుతుంది.

స్వర్ణరథం(20092026)(సాయంత్రం 4గంటలకు)

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు సాయంత్రం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. స్వర్ణరథం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైంది. ఈ స్వర్ణోత్సవ సేవలో కల్యాణకట్ట సేవాపరులు తొలుత బంగారు గొడుగును అలంకరించడం సంప్రదాయంగా వస్తోంది. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు రథగమనాన్ని వీక్షించిన ద్వారకా ప్రజలకు ఎంతో ఆనందం కలిగింది. స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీనివాసుడిని చూసిన భక్తులకు కూడా అలాంటి సంతోషమే కలుగుతుంది.

**గజవాహనం(20-09-2026)(రాత్రి 7 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తాడు. శ్రీవారిని గజేంద్రుడు మోస్తున్నట్టు భక్తులు కూడా నిరంతరం శ్రీనివాసుని హృదయంలో పెట్టుకుని శరణాగతి చెందాలని ఈ వాహనసేవ ద్వారా తెలుస్తోంది.





**సూర్యప్రభ వాహనం(21-09-2026)(ఉదయం 8 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 7వ రోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. సూర్యుడు తేజోనిధి, సకల రోగ నివారకుడు. ప్రకృతికి చైతన్య ప్రదాత. వర్షాలు, వాటి వల్ల పెరిగే చెట్లు, చంద్రుడు, అతని వల్ల పెరిగే సముద్రాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. సూర్యప్రభ వాహనంపైన శ్రీనివాసుని దర్శనం వల్ల ఆరోగ్య విద్య, ఐశ్వర్యం, సంతానం వంటి ఫలాలు సూర్యదేవుని అనుగ్రహం వల్ల భక్తకోటికి సిద్ధిస్తాయి.

**చంద్రప్రభ వాహనం(21-09-2026)(రాత్రి 7 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ తన రాజసాన్ని భక్తులకు చూపుతాడు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది. భక్తుల కళ్లు వికసిస్తాయి. భక్తుల హృదయాల నుండి అనందరసం స్రవిస్తుంది. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆది దైవికమనే మూడు తాపాలను ఇది నివారిస్తుంది.

**శ్రీవారి రథోత్సవం(22-09-2026)(ఉదయం 7.30 గంటలకు)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు ఉదయం ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు, ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చుతారు. దీన్నివల్ల స్థూల శరీరం వేరని, సూక్ష్మ శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు కానీ, సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన రథాన్ని తానే లాగుతున్నాడని అన్నమయ్య అనడం ముదావహం.

అశ్వవాహనం(22092026)(రాత్రి 7 గంటలకు)

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు అశ్వవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహిస్తాడు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలను వర్ణిస్తున్నాయి. ఆ గుర్రాలను అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు అని కృష్ణయజుర్వేదం తెలుపుతోంది. స్వామి అశ్వవాహనారూఢుడై కల్కి అవతారంలో తన స్వరూపాన్ని ప్రకటిస్తూ భక్తులను కలిదోషాలకు దూరంగా ఉండాలని తన అవతారంతో ప్రబోధిస్తున్నాడు.

**చక్రస్నానం(23-09-2026)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన 9వ రోజు ఉదయం చక్రస్నానం వేడుకగా జరుగుతుంది. చక్రస్నానం యజ్ఞాంతంలో ఆచరించే అవభృథస్నానమే. ముందుగా ఉభయదేవేరులతో కలిసి శ్రీవారి సరసన ఉన్న చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తెనె, చందనంతో అర్చకులు అభిషేకం చేస్తారు. ఈ అభిషేక కైంకర్యాన్ని అందుకుని చక్రత్తాళ్వార్ ప్రసన్నుడవుతాడు. చక్రస్నానం సమయంలో అధికారులు, భక్తులందరూ పుష్కరిణిలో స్నానం చేసి యజ్ఞఫలాన్ని పొందుతారు.

**ధ్వజావరోహణం(23-09-2026)**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన 9వ రోజు రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం తరువాత ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ధ్వజావరోహణ ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## సీబీఆర్ నుంచి పీఏబీఆర్‌కు 1 టీఎంసీ నీరు

- బత్తలపల్లి, తాడిమర్రికి తాగు, సాగునీటి భరోసా......
- 45,800 ఎకరాలకు ప్రయోజనం....





**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గంలో ని కరువు ప్రభావిత బత్తలపల్లి, తాడిమర్రి మండలాల తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సీబీఆర్ నుంచి పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతానికి 1 టీఎంసీ జీఎన్ఎస్ఎస్ వరద నీటిని తరలించే ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి లేఖ అందజేశారు. సీబీఆర్ దిగువ భాగంలో లభించే వరద నీటిలో 1 టీఎంసీని ఎత్తిపోసి, మన్నీల గ్రామం సమీపంలోని పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతానికి ప్రెజర్ మెయిన్ ద్వారా తరలించే ప్రతిపాదనను వివరించారు.

ఈ పథకం అమలైతే 48 చెరువులు, 24 చెక్‌డ్యామ్‌లకు నీరు అందడంతోపాటు బత్తలపల్లి మండలంలోని 21,900 ఎకరాలు, తాడిమర్రి మండలంలోని 23,900 ఎకరాలు కలిపి మొత్తం 45,800 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే చెరువులు నిండడం ద్వారా భూగర్భ జలమట్టాలు పెరిగి రెండు మండలాల తాగునీటి సమస్యకు కూడా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి నీటి లభ్యత కీలకమని సత్యకుమార్ తెలిపారు. సీబీఆర్ నిర్మాణం కోసం తాడిమర్రి మండల ప్రజల భూములు వినియోగించినందున, ఆ ప్రాంత ప్రజలకు రిజర్వాయర్ నీటితో ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. 1 టీఎంసీలో 559.57 ఎంసీఎఫ్‌టీని చెరువుల నింపుదలకు, 440.43 ఎంసీఎఫ్‌టీని తాగునీటి అవసరాలకు వినియోగించేలా ప్రతిపాదన రూపొందించినట్లు తెలిపారు. ఈ పథకానికి సూత్రప్రాయ ఆమోదం ఇచ్చి, నీటి కేటాయింపులు మంజూరు చేసి, డీపీఆర్ సిద్ధం చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు.

## ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలి..

- ఆర్డీవో కళావతి..

**గాండ్లపెంట, సెప్టెంబర్, 3, అనంత జనశక్తి న్యూస్,**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కదిరి ఆర్డీవో కళావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆర్డీవో ఆయా విభాగాల్లో కొనసాగుతున్న పని తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, భూ రీసర్వేకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ, జనాభా లెక్కలకు సంబంధించిన వివరాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై అధికారులతో చర్చించారు

ఈ సందర్భంగా ఆర్డీవో కళావతి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అవసరమైన సమాచారం అందించి, వారి సమస్యలను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు





భూములకు సంబంధించిన దరఖాస్తులు, భూ రీసర్వే ప్రక్రియలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా భద్రపరచడంతో పాటు వాటిని ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు

అదేవిధంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో కళావతి సూచించారు. ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అందుతున్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల వివరాలను నిబంధనల మేరకు పరిశీలించాలన్నారు

కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహించాలని, ప్రజలకు అందాల్సిన సేవలను సకాలంలో అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో రామకృష్ణ, ఆర్ఐ జాఫర్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ నమోదుతో ప్రభుత్వ ప్రయోజనాలు పొందొచ్చు..

- రైతులకు మండల వ్యవసాయాధికారి షాదాబ్ సూచన.

**గాండ్లపెంట, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోని గొడ్డువెలగల గ్రామంలో గురువారం రైతులకు ఈక్రాప్, రైతు నమోదు, వ్యవసాయ సమాచార వ్యవస్థపై మండల వ్యవసాయాధికారి షాదాబ్ అవగాహన కల్పించారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల వివరాల నమోదు ద్వారా ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలను రైతులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా వ్యవసాయాధికారి షాదాబ్ మాట్లాడుతూ ఈక్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకోవడం వల్ల పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, వివిధ రకాల సబ్సిడీలు, మద్దతు ధర, సున్నా వడ్డీ రుణాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు పంట సాగు చేసిన వెంటనే సంబంధిత వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

బీడుగా ఉన్న భూములను కూడా రైతులు నమోదు చేయించుకోవాలని, అటువంటి భూముల్లో ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను సాగు చేసేందుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూములను సాగులోకి తీసుకురావాలని సూచించారు.



రైతులు తమ భూమి వివరాలను ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో అనుసంధానం చేసుకుని ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియ ద్వారా భవిష్యత్తులో వ్యవసాయ శాఖకు సంబంధించిన పథకాలు, సేవలను సులభంగా పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మండలంలో ఇప్పటివరకు రైతు నమోదు ప్రక్రియ 83 శాతం పూర్తయిందని, మిగిలిన రైతులు కూడా ఆలస్యం చేయకుండా సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రసాద్, కంబయ్య, పంచాయతీ కార్యదర్శి హనుమంతరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు అర్షియతో పాటు

# ఎస్సీ, ఎస్టి లకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై సమీక్ష.




**-సబ్ డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం.**

**-ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.**

**ధర్మవరం సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎస్సీ ఎస్టీ వర్గాల సంక్షేమం అభివృద్ధి వారి హక్కుల పరిరక్షణకు సంబంధించి సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశమును నిర్వహించడం జరిగిందని ఆర్డీవో రామభూపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి డీఎస్పి బీవీ జగన్నాథరాజు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలు అమలు వారికి అందుతున్న ప్రభుత్వ సేవలు, హక్కుల పరిరక్షణ, పెండింగ్లో ఉన్న సమస్యలు, తదితర అంశాలపై సమీక్షను నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల ద్వారా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించాలని నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని తహసీల్దారులు, సంబంధిత శాఖల అధికారులు, డివిఎంసి సభ్యుడు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి సరఫరా నిలిపివేత..

**-మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య**

**ధర్మవరం సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**



మున్సిపాలిటీ పరిధిలోని దిమ్మెల సర్కిల్ నందు జోన్ 2 ఇంటర్ కనెక్షన్ పనులలో భాగంగా పబ్లిక్ హెల్త్ వారు సెప్టెంబర్ 8వ తేదీ 9వ తేదీలలో రెండు రోజులు పాటు మరమత్తు పనులను నిర్వహిస్తున్నందున, రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఈ రెండు రోజులు కొన్ని ప్రాంతాలలో మాత్రమే అనగా గుట్ట కింద పల్లి, రాంనగర్ ,లక్ష్మీ నగర్, కొత్తపేట, గిర్రాజ కాలనీ, తారకరామాపురం, సుందరయ్య నగర్, దుర్గా నగర్, శివరామ నగర్, బాలాజీ నగర్, టీచర్స్ కాలనీ, మారుతీ నగర్ సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు. కావున ఈ ప్రాంత ప్రజలు పై విషయాన్ని గమనించి ముందస్తుగా అవసరమైన నీటిని నిలువ చేసుకొని మరమ్మత్తు పనులకు సహకరించవలసిందిగా వారు కోరారు. పైప్లైన్ లీకేజీలు మరమ్మత్తు పనులు పూర్తి అయిన అనంతరం నీటి సరఫరాను యధా విధంగా పునర్దించడం జరుగుతుందని తెలిపారు. నీటి సరఫరా నిలిపివేత వలన ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని వారు తెలిపారు.

# అగాపేలో అన్నదానం చేసిన గిద్దలూరు ఎర్రిస్వామి

**యాడికి, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు గురువారం పెనుగొండ ఎంపిడిఓ గిద్దలూరు ఎర్రిస్వామి అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు.పెనుగొండ మండల ఎంపిడిఓ, ఉరవకొండ కు చెందిన గిద్దలూరు ఎర్రిస్వామి మనవడు దక్ష ఆర్యన్ మొదటి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు.దక్ష ఆర్యన్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు సుఖశాంతులతో జీవించాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు.



# తండాలకు మహర్దశ.. రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



- **గిరిజన తండాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**
- **రూ.3 కోట్ల ఎస్టీ సబ్ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం**
- **నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవిత**

**పెనుకొండ సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**

పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత తెలిపారు. ఎస్టీ సబ్ప్లాన్ నిధుల ద్వారా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణిని సచివాలయంలో మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ మండలంలోని మక్కాజపల్లి, కొండంపల్లి, గోనిపెంట తండాలతో పాటు గోరంట్ల మండలంలోని బీఎన్ తండా, కొమ్మలతండా, బూచేపల్లి తండా, భీమ్లా నాయక్ తండా, గంగంపల్లి తండా, దాసరిపల్లి తండా, మిషన్ తండాతో పాటు పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు.తండాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగడంతో పాటు పారిశుధ్యం మెరుగుపడుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు. గిరిజన తండాల్లో నివసించే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాల సమగ్ర అభివృద్ధికి రూ.3 కోట్ల ఎస్టీ సబ్ప్లాన్ నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మంత్రి సవిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలోని అన్ని తండాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నెరవేరబోతున్న నారాయణపురంకు నూతన ఆసుపత్రి

- **42 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన**
- **భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అంబికా**
- **ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన నారాయణపురం వాసులు**
- **రెండేళ్ల పాలన గురించి 80వేల ఇళ్లకు వెళ్లి వివరించామన్న ఎమ్మెల్యే**
- **ఎల్. నినో నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్న ఎంపీ అంబికా**

**అనంతపురం సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నారాయణపురంలో నూతన ఆసుపత్రి నిర్మాణం కాబోతోంది. ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద 42 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు. ముందుగా నారాయణపురం వాసులు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఘన స్వాగతం పలికారు. భూమి పూజ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నారాయణపురం ప్రాంతంలో నారాయణపురం ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకొని ఇక్కడ సిబ్బంది, వైద్యులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ఏ అవసరం వచ్చినా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సమస్యకు తాము పరిష్కారం చూపించామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో ఈ ఆసుపత్రిని నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందన్నారు. రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అందుకే ఇంటింటికి కూటమి ప్రభుత్వం పేరుతో ప్రజల్లోకి వెళ్లి తాము చేసిన వాటిని వివరించామన్నారు. ఇప్పటికే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 80 వేల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను వివరించామన్నారు. అనంతపురం జిల్లా వంటి వెనుకబడిన ప్రాంతానికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. అదేవిధంగా అదే స్థాయిలో ఉద్యోగాలు కల్పన కూడా జరుగుతోందన్నారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేశామన్నారు. దీనిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 250కోట్ల రూపాయలతో రోడ్ల, డ్రైనేజీలు వంటి మాలిక వసతులు కూడా కల్పించామన్నారు. త్వరలోనే 160 కోట్లతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టితో అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఎల్.నినో ప్రభావంతో మన రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రంలోనూ, ఇతర దేశాల్లో కూడా తీవ్రమైన నీటి సమస్య వచ్చిందన్నారు.

మరో ఏడాది పాటు ఈ సమస్య ఉంటుందని అంచనా వేసి ముందే స్పష్టమైన ప్రణాళికతో నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ ఏడాది వర్షాలు లేని కారణంగా ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా తాగునీటిని ముందే తగినంతగా నిల్వ చేసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరు వరి, మిర్చి లాంటి పంటలు వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. నారాయణపురంలో ఆసుపత్రి తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేలా చేశారని ఎంపీ అంబికా అన్నారు. ఈ కార్యక్రమంలో డిష్ నాగరాజు, రఘునాథ్, జయప్రకాష్, కదిరప్ప, వెంకటలక్ష్మి, అశ్విని, అక్షిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో అసమ్మతి సెగ...!!



- **బిజెపిలో రగిలిన అసంతృప్తి జ్వాల**
- **తనను అడగకనే వార్డు ఇన్చార్జిగా నా పేరు ఎలా చేరుస్తారు**
- **వార్డుకే పరిమితం చేయడం వెనుక మీ ఆంతర్యం ఏమిటో చెప్పండి**

- **బిజెపి పెద్దలను ప్రశ్నించిన డోలా రాజారెడ్డి ?**
- **తాడోపేడో తేల్చుకోవడానికి సన్నద్ధం**
- **బిజెపిపై అసంతృప్తిలో మరో ఇద్దరు నాయకులు**

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,**

**సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

మునిసిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ధర్మవరం బిజెపిలో ముసలం మొదలైంది. ఇప్పుడిప్పుడే ఒక్కొక్కరు తనలోని అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కే పరిస్థితి ఏర్పడుతోంది. తాజాగా వార్డు ఇన్చార్జిల నియామకంతో ఒక్కసారిగా బిజెపి లోని అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంటోంది. తనను అడగకనే వార్డు ఇన్చార్జిగా నా పేరు ఎలా చేరుస్తారంటూ... బిజెపి జిల్లా నాయకులు డోలా రాజారెడ్డి ఏకంగా బహిరంగ విమర్శలకు దిగినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కార్యవర్గంలో పనిచేస్తున్న తనను ఒక వార్డుకు పరిమితం చేయడం చూస్తుంటే తనపై మీరు ఏ స్థాయిలో చిన్నచూపు చూస్తున్నారో... అర్థమయిపోయిందని కొందరు బిజెపి నాయకులు వద్ద తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు బిజెపి వర్గాల ద్వారా తెలుస్తోంది. బిజెపిలో తాను ఎదగడాన్ని ఓర్వలేక కొందరు దుష్టశక్తులు అడుగడుగునా అడ్డు తగులుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వద్ద తన మనసులోని మాటను వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీకి ఒక సైనికుడిలా అంకిత భావంతో పనిచేస్తూ తన స్థాయికి మించి అభివృద్ధి కృషి చేస్తుంటే ఇది ఓర్వలేక కొందరు తనపై సొంత పార్టీ వారే బురద చల్లడం ఎంతవరకు సబబు అని పార్టీ పెద్దల వద్ద తన అక్కసును వెల్లబోసుకున్నట్లు తెలుస్తోంది.

తనకి పార్టీ పదవులు కానీ, కౌన్సిలర్ పదవి కానీ అవసరం లేదని సామాన్య కార్యకర్తల పార్టీ కోసం తమ వంతు కృషి చేస్తానని కొందరు బిజెపి పెద్దల వద్ద తన మనోగతాన్ని వెల్లడించినట్లు సమాచారం. మీలాంటి పెద్దలు కూడా ఎవరు ఎలాంటి వారు తెలుసుకుంటే బాగుంటుందని డోలా రాజారెడ్డి తన మనసులోని మాటను బహిరంగంగా వెల్లగక్కినట్లు కొందరు బిజెపి నాయకులు పేర్కొన్నారు. లేకపోతే పార్టీ ఇబ్బందులు పడే ప్రమాదం కూడా లేకపోలేదని తన మనోగతాన్ని వెల్లడించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. పార్టీలో కష్టపడ్డ వారికి పదోన్నతులు ఉంటాయి కానీ ధర్మవరంలో మాత్రం అందుకు విరుద్ధంగా సాగు తుండడం దేనికి సంకేతమో మీరే ఆలోచించు కోండనీ కొందరు నాయకుల తీరుపై విమర్శనాస్త్రాలు సంధించినట్లు సమాచారం. ఈయనతో పాటు రూరల్ ప్రాంతానికి చెందిన మరో నాయకుడు కూడా బిజెపిపై తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరి మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఏ స్థాయికి దారి తీస్తుందో వేచి చూడాలి మరి.

# స్వీట్ ఓటర్ పై విద్యార్థులకు అవగాహన.

**- తాసిల్దార్ దేవరాజ్**

**ధర్మవరం సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో తాసిల్దార్ దేవరాజ్ ఆధ్వర్యంలో స్వీప్ ఓటరుపై అవగాహన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ...... విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటరు నమోదు, నైతిక ఓటింగ్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం లాంటి విషయాలను వారు వివరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో యువత భాగస్వామ్యం తదితరాంశాలపై కూడా అవగాహన కల్పించడం జరిగింది అని తెలిపారు.01/07/2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి అయిన యువతి యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భాగస్వాములు కావలసిన బాధ్యత కూడా ఉందని వారు గుర్తు చేశారు. అదేవిధంగా ఓటర్ల నుంచి క్లైములు అభ్యంతరాలను స్వీకరించే చివరి తేదీ సెప్టెంబర్ 10వ తేదీ వరకు పొడిగించారని తెలిపారు. ప్రత్యేక ప్రచార దినములు సెప్టెంబర్ 5వ తేదీ ఆరవ తేదీ కూడా నిర్వహిస్తామని తెలిపారు.




# అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు.

*** కరస్పాండెంట్ మల్లికార్జున, డైరెక్టర్ పృథ్విరాజ్.**

**ధర్మవరం సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణములోని యశోద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, డైరెక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ.... శ్రీకృష్ణుని పూజలు అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు భక్తి గీతాలు చూపు రూ లను ఎంతగానో ఆకట్టుకున్నాయి అని తెలిపారు. అనంతరం శ్రీ కృష్ణాష్టమి వేడుకల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మరికవలస గురుకుల పాఠశాల తరలింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

**– వైఎస్ఆర్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస నాయక్.....**

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 03 అనంత జన శక్తి న్యూస్.**



విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని మరి కవలసలో ఉన్న గురుకుల పాఠశాల ను ఉన్నపళంగా మరోచోటికి తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వైఎస్ఆర్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస నాయక్ తెలిపారు.
గురువారం పుట్టపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్ర లో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అర్ధరాత్రి విద్యార్థులను గురుకుల పాఠశాల ఖాళీ చేయించి, అందులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పెట్టాలని నిర్ణయించడం శోచనీయమన్నారు.
అర్ధరాత్రి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిలిపించి, విద్యార్థులను బస్సుల్లోకి నెట్టడం చూస్తుంటే బ్రిటిష్ పాలన గుర్తుకొస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చిన్నపిల్లలు ఉన్నారని, వారిని కూడా దుర్భాషలాడుతూ తరలించడం దారుణమని, అధికారులకు కనీసం దయాదాక్షిణ్యాలు లేవా అని ప్రశ్నించారు.
ఈ గురుకునికి ఎంతో ప్రతిష్ట ఉందని ఇక్కడ ఎంతోమంది ఆదివాసి బిడ్డలు చదువుకోవాలని ఆశపడతారని అందుచేత విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఆదివాసీ బిడ్డలు చదువుకుంటున్నారని, ఆదివాసీల కోసం ప్రత్యేకంగా రూ.6500 కోట్ల నిధులు ఉంటే, ఆ నిధులతో మరోచోట నిర్మించుకోకుండా ప్రతిష్టాత్మక గురుకులాన్ని ఖాళీ చేయించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.ఆదివాసీ బిడ్డలపై అంత ప్రేమ ఉంటే మరోచోట కళాశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని సత్వరమే పరిష్కరించకపోతే ఆంధ్రప్రదేశ్ లోని ఆదివాసీ విద్యార్థి, ప్రజా సంఘాలను సంఘటితం చేసి ఉద్యమిస్తామని శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు.

## ఏపీ జెఎసి ఆధ్వర్యంలో నిరసన.



**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 03 అనంత జన శక్తి న్యూస్.**

**ఏపీ అమరావతి జేపసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు నిరసన కార్యక్రమాన్ని పుట్టపర్తి ప్రశాంతి గ్రామం జిల్లా కార్యాలయం సముదాయంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, అమరావతి జేఏసీ నాయకులు, రెవెన్యూ ,వైద్య , పంచాయితీ, వివిధ సంఘ నాయకులు విశ్రాంతి సమయంలో అమరావతి జేఏసీ సి నాయకులు, మైనోద్దీన్, ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్యాలయం ఎదుట ప్లే కార్డులు చేతబూని ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల పూర్తి అయినా ఉద్యోగుల సమస్యల పరిష్కారం చూపలేదని, ఉద్యోగులకు రావలసిన బకాయిలను, ఆర్థిక ప్రయోజనాలను వెంటనే అందజేయాలని, పిఆర్సి కమిషన్, (తాత్కాలిక భృతి)ఐ ఆర్,ప్రభుత్వం వెంటనే అందజేయాలని, వీటితోపాటు ప్రభుత్వం ముందు ఉంచిన 21, డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, మైనుద్దీన్, ప్రధాన కార్యదర్శి జివైపి రావు, మున్సిపాలిటీ, శంకర్, సచివాలయాల జేఏసీ నాయకులు చౌడప్ప, శశి కుమార్, కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం నాయకులు, చక్రపాణి, జిల్లా వైద్యశాఖ సిబ్బంది డి పి హెచ్ ఎన్ ఓ వీరమ్మ, ఎస్ ఓ కళాధర్, బాబా ఫక్రుద్దీన్ ,ఫిరోజ్, నాగభూషణం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.**

## ఓటరు జాబితా పై గ్రామసభ




**యాడికి, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :**
మండల కేంద్రంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఈఓ ప్రమీల ఆధ్వర్యంలో ఓటరు జాబితా పై గ్రామసభ ను నిర్వహించారు. బుధవారం తెలిపారు. ఎంపిడిఓ వీర్రాజు, తెదేపా నాయకుడు రుద్రమ నాయుడు లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ వీర్రాజు,ఈఓ ప్రమీల , తెదేపా నాయకుడు రుద్రమ నాయుడు లు మాట్లాడుతూ ఓటరు జాబితా వివరాలను కూలాల వారిగా చదివి వినిపించారు.అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది,సచివాలయం సిబ్బంది, తెదేపా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పనులను పరిశీలించిన అధికారులు

**యాడికి, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని రాయలచెరువు వేములపాడు ప్రధాన రహదారి పక్కన ఉన్న ఏపీ మోడల్ స్కూల్ నందు జరుగుచున్న ఆల్ట్రా ఐడెన్సిటీ ప్లాంటేషన్ ఫిట్టింగ్ పనులను ఎంపిడిఓ వీర్రాజు, ఎపిఓ మద్దిలేటి లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రామికులతో ఎంపిడిఓ వీర్రాజు, ఎపిఓ మద్దిలేటి లు మాట్లాడుతు పనులు నాణ్యతగా చేయాలని,వీలైనంత త్వరగా గుంతలు తీసే కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు .వర్షాలు వచ్చిన వెంటనే మొక్కలు నాటాలని,ఫీల్డ్ అసిస్టెంట్ హరినాథ్ కు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



## రాప్తాడులో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

**రాప్తాడు సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లా స్థాయి ప్రకృతి వ్యవసాయ సమన్వయ అధికారి, మండల ప్రాజెక్టు అధికారి డి.పి.ఎం. లక్ష్మీనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి చైతన్య, సహాయ ప్రాజెక్టు మేనేజర్ సునీత హాజరయ్యారు.
ఈ సందర్భంగా డి.పి.ఎం. లక్ష్మీనాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో పాటు, ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చే రైతులకు ఈ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వనరులు, జీవ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు రైతులకు అందుబాటులో ఉండేలా కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ వనరుల కేంద్రాన్ని శ్రీనివాస గ్రామ సంఘం సహకారంతో కె. సిద్దమ్మ, భర్త చంద్రశేఖర్ నిర్వహించనున్నారు. వెలుగు సమాజ అభివృద్ధి సమన్వయకర్త మల్లికార్జున, రాప్తాడు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ వనరుల సిబ్బంది, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

**రాప్తాడు సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్**

**రాప్తాడు మండల కేంద్రంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్, నాగభూషణ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రాప్తాడు సీఐ వెంకటేశ్వర్లు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.**
**పదోన్నతితో మరింత బాధ్యత పెరిగిందని, కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఐ సూచించారు. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.**






## ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాపై గ్రామసభ

**రాప్తాడు సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు గురువారం గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారుల అధ్యక్షతన ఈ గ్రామసభలు జరిగాయి. ఇందులో భాగంగా రాప్తాడు గ్రామపంచాయతీ పరిధిలోని నాగులకట్ట వద్ద ఎంపీడీవో బి. విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాలను ప్రజల సమక్షంలో పరిశీలించి, జాబితాపై అభ్యంతరాలు లేదా సూచనలు ఉన్నాయా అని అధికారులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభకు ప్రజలు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త ఽటుంబాన్ని,పరామర్శించిన మాజీ,మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్,రెడ్డి

**ఆమడగూరు, సెప్టెంబర్ 3:**

**(అనంత జనశక్తి న్యూస్ )**

ఆమడగూరు మండలం కొట్టువారిపల్లిలో టీడీపీ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ కుటుంబాన్ని మాజీ మంత్రి, టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి,పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు.
రామకృష్ణ కోడలు టీడీపీ కార్యకర్త చలపతి భార్య సింధుజ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొట్టువారి పల్లికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.
అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆమడగూరు మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను కూడా మాజీ మంత్రి పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీమంత్రి,పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు
మాజీ జెడ్పీ చైర్మన్ దేశాయ్ రెడ్డెప్ప రెడ్డి సతీమణినీ పరామర్శించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
తనకల్లు మండలం పరాకులపల్లి గ్రామంలో ఉన్న మాజీ జెడ్పీ చైర్మన్ దేశాయ్ రెడ్డెప్ప రెడ్డి గారి సతీమణినీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి మాజీ జెడ్పిటిసి పెద్దక శ్రీనివాస్ రెడ్డి నాయకులు కుమార్ రెడ్డి రామకృష్ణ టైలర్ రమణ కుక్కంటి పల్లి నాగేందరరెడ్డి డీలర్ గోపాల్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




## అగళిలో ఘనంగా బీకే పార్థసారథి జన్మదిన వేడుకలు

**అగళి సెప్టెంబర్ 03,అనంత జనశక్తి న్యూస్:**

హిందూపురం పార్లమెంట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బీకే పార్థసారథి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, అగళి మండల జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో అగళి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బీకే పార్థసారథికు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీ రవికుమార్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి జయప్ప, మాజీ కన్వీనర్ షౌకత్, పాత్రికేయుడు శివప్ప, కరియన్న, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు మల్లికార్జున, పురం జయరామప్ప, ఇరిగేపల్లి గొల్లహట్టి రెడ్డి, అలాగే మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఓటరు జాబితా పై గ్రామసభ

**అగళి సెప్టెంబర్ 03,అనంత జనశక్తి న్యూస్:**

గ్రామపంచాయతీ ఎన్నికల ముందస్తు ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపిడిఓ గంగాధర్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా పై గ్రామసభను నిర్వహించారు. గ్రామ సభకు జడ్పీటీసీ ఉమేష్, మండల అధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితా మేరకు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీగా పేర్ల మార్పుకోసం, పేర్లు చేర్చడంపై అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని తెలిపారు. వీటిపై ఆయా ఎంపీడీవోల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, మాజీ సర్పంచు లక్ష్మమ్మ హనుమంతరాయప్ప, తెదేప నాయకులు షౌకత్, ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీపురం చెరువులో పశుగ్రాసం సాగుకు శ్రీకారం..

**- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్, తదితరులు..**

**అనంతపురం, సెప్టెంబర్ 03 :**

**అనంత జనశక్తి న్యూస్**




గుత్తి మండలం శ్రీపురం ( కొజ్జేపల్లి) గ్రామ చెరువులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సూపర్ ఎల్.నినో పరిస్థితుల్లో చెరువు గర్భంలో పశుగ్రాసం సాగు ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్, తదితరులు పాల్గొన్నారు. కొద్దిగా కురిసిన వర్షాలకు చెరువు గర్భంలో ఉన్న తేమను ఉపయోగించుకొని పశుగ్రాసం అద్భుతంగా పండుతుందనే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీపురం చెరువు గర్భంలో 25 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ సూపర్ ఎల్.నినో పరిస్థితుల్లో చెరువు గర్భంలో పశుగ్రాసం సాగు ఎంతో ముఖ్యమైనదన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 297 ఎకరాల్లో పశుగ్రాస సాగుకు అనుమతి ఇవ్వగా, ఇప్పటివరకు 249 ఎకరాల్లో విత్తనాలు చల్లడం పూర్తయిందని, మిగిలిన విస్తీర్ణంలో కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పశుగ్రాసం సాగు వల్ల పశువులకు ఆహారం అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (PMDS) పద్ధతిలో ఘనజీవామృతం, బీజామృతం ద్వారా విత్తనాలను శుద్ధి చేసి నాటుకున్నట్లయితే, చిన్న చినుకులకు కూడా మొలక వస్తుందని, తదనంతరం భూమి గర్భంలో ఉండే తేమను ఉపయోగించుకొని ఈ కార్యక్రమం విజయవంతం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రేమ్ చంద్ మాట్లాడుతూ పశుగ్రాసం విత్తుకోవడానికి మరియు దున్నుకోవడానికి ఆర్డీటీ సంస్థ వారు ఎకరానికి 3,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ తరఫున ప్రతి ఎకరానికి 1,840 రూపాయల విలువ చేసే 20 కేజీల ఉచిత విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఇక్కడి చెరువులో 25 ఎకరాల్లో పండే పశుగ్రాసం ద్వారా రాబోయే 6 నెలల పాటు సుమారు 200 పశువులకు సరిపడా గ్రాసాన్ని అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ డిడి రమేష్ రెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి, పశుసంవర్ధక శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# స్నేహంతోనే నన్ను గెలవాలి నేను ఎవరికీ గులామ్‌ను కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. ''ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం''అని రేవంత్ అన్నారు.

**రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్**

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

## రాఘవ్ చడ్డాకు
# ఓటర్ లిస్ట్ షాక్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్**

రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత రాఘవ్ చడ్డా పేరు పంజాబ్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం రాజకీయ దుమారం రేపుతోంది. ఆయన ప్రస్తుతం బిజేపీ పార్టీలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంజాబ్‌లో నిర్వహించిన ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఆయన పేరును 'షిఫ్టెడ్'గా పేర్కొన్నట్లు రాఘవ్ చడ్డా తాజాగా వెల్లడించారు. తన ఓటర్ ఐడీ పంజాబ్‌లోని మొహాలీలో రిజిస్టర్ అయి ఉన్నప్పటికీ ఇలా ఎలా చేశారంటూ ఆయన ప్రశ్నించారు.

**'ఇది క్లరికల్ మిస్టేక్ కాదు'**

తన పేరు ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడంపై రాఘవ్ చడ్డా తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం అధికారుల స్థాయిలో జరిగిన పొరపాటు కాదని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. తాను పంజాబ్ నుంచి ప్రస్తుత రాజ్యసభ సభ్యుడినని, తన ఓటర్ ఐడీ మొహాలీలోనే ఉందని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం ఉన్నది డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ మాత్రమేనని, తుది జాబితా కాదని చడ్డా తెలిపారు. క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ ప్రక్రియలో తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందని, SIR మార్గదర్శకాల ప్రకారం అందుబాటులో ఉన్న పరిష్కారాలను ఇప్పటికే వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. తుది ఓటర్ జాబితా అక్టోబర్‌లో విడుదల కానుందని అధికారులు తెలిపారు. ఓటర్ లిస్ట్ తయారీ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్ నుంచి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (, డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ వరకు వివిధ స్థాయిల్లో అధికారులు పనిచేస్తారని చడ్డా తెలిపారు. ఇంతటి వ్యవస్థ ఉన్నప్పుడు తన పేరును 'షిఫ్టెడ్'గా ఎలా గుర్తించారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

ప్రజాప్రతినిధుల విషయంలో ఎన్నికల మార్గదర్శకాల్లో ప్రత్యేక జాగ్రత్తలు ఉండాలని, తన విషయంలో ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టినట్లు అనిపిస్తోందని ఆయన ఆరోపించారు. పంజాబ్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ అధికార పార్టీకి చెందిన వ్యక్తిగత ఆస్తి కాదని ఆయన వ్యాఖ్యానించారు. తాను ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన తర్వాత ఆ పార్టీ నేతల్లో తనపై ఆగ్రహం పెరిగిందని రాఘవ్ చడ్డా చెప్పుకొచ్చారు. తనతో పాటు పార్టీని వీడిన ఇతర నేతలను కూడా పంజాబ్ ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని విమర్శించారు. తన పేరు ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం కూడా రాజకీయ కక్షలో భాగమని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను AAP ఖండించింది. SIR ప్రక్రియ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతుందని, ఓటర్ జాబితాలో ఎవరిపేరు ఉండాలి, ఎవరిపేరు తొలగించాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయాధికారం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. రాఘవ్ చడ్డా పేరు తొలగింపు వ్యవహారం ఇప్పుడు పంజాబ్ రాజకీయాల్లో వివాదానికి దారితీసింది. డ్రాఫ్ట్ జాబితాలో చోటుచేసుకున్న ఈ మార్పు తుది జాబితాలోనూ కొనసాగుతుందా? లేక క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ ప్రక్రియలో ఆయన పేరు తిరిగి చేరుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రైతులకు సాయం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అమరావతి మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన భూసమీకరణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి పార్థసారథి.. కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు..

**రైతులకు గుడ్ న్యూస్..**

తోతాపురి మామిడి రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు రూ.281 కోట్ల మద్దతు ధర నిధులు అందించాలని నిర్ణయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా స్వల్పకాలిక రుణాలు అందించేందుకు కూడా కేబినెట్ అనుమతి ఇచ్చింది. రైతులకు సంబంధించిన అన్ని అంశాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇక, పొగాకు రైతులకు రూ.94 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలు, ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులు, ప్రభుత్వ పథకాల ప్రచారం, నిత్యావసర ధరల నియంత్రణ తదితర అంశాలపై కీలక సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలన్నింటినీ ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ఆదేశాలు**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఉన్న న్యాయపరమైన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. కోర్టు పరిధిలో ఉన్న 23 మున్సిపాలిటీలతో పాటు మొత్తం 100 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

**ఎల్‌నినోపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ**

ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో వర్షాలు మైనస్ 52 శాతం నమోదైన నేపథ్యంలో తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. సీడ్ బాల్స్ కార్యక్రమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు అందించడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడితో పాటు ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు.

**ప్రజల్లోకి మంత్రులు వెళ్లాలి**

మంత్రులందరూ ప్రజల్లోకి వెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. "మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి" అని మంత్రులకు సూచించారు. కొత్త తరం జెన్‌జెడ్ యువత అన్ని విషయాలపై అవగాహనతో ఉందని, సోషల్ మీడియాలో వారు చురుకుగా ఉంటున్నారని సీఎం పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మంత్రులు, పార్టీ శ్రేణులు కూడా సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జెన్‌జెడ్ యువతకు చేరవేయాలని చెప్పారు.

**వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదల విషయంలోనూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని సీఎం అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని, ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు పూర్తయినా అది తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయినదని, ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు.



# మైన్స్ శాఖ కొత్త కార్యాలయం ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

- మైనింగ్ రంగంలో పారదర్శకత, ఆదాయ పెంపుపై దృష్టి: కొల్లు రవీంద్ర
- అక్రమ మైనింగ్‌కు చెక్ పెట్టేందుకు ఏఐ, డ్రోన్లతో నిఘా

**అమరావతి, సెప్టెంబర్ 3:అనంత జనశక్తి న్యూస్**



మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన గనులు, భూగర్భ వనరుల శాఖ డైరెక్టరేట్ కొత్త కార్యాలయాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం ప్రారంభించారు. మైనింగ్ రంగం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.కొత్త కార్యాలయంలో ఏర్పాటు చేసిన కెమికల్ ల్యాబ్, కమాండ్ కంట్రోల్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్, రికార్డు రూమ్, మైన్స్ ఎగ్జిబిషన్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం అన్ని జిల్లాల మైనింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి, జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. వేలం వేసిన గనులు అనుమతులు, భూమి సమస్యల వద్ద ఆగిపోకుండా ఉత్పత్తి దశకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.202526లో మైన్స్ శాఖ రూ.3,416 కోట్ల ఖనిజ ఆదాయం సాధించిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 32 శాతం అధికమని మంత్రి తెలిపారు. ఇతర వసూళ్లతో కలిపి మొత్తం ఆదాయం రూ.4,339 కోట్లకు చేరిందన్నారు. 202627లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.1,287.33 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు.202526లో 21 ప్రధాన ఖనిజ గనులను వేలం వేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో దాదాపు 450 లీజులు మంజూరు చేశామన్నారు. ఉచిత ఇసుక విధానం ద్వారా జూలై 2024 నుంచి సుమారు 2.1 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేశామని చెప్పారు. కడప బేసిన్‌లో లిథియం, గాలియం అన్వేషణను CSIRNGRIతో కలిసి చేపడుతున్నట్లు తెలిపారు. జొన్నగిరిలో వాణిజ్య బంగారం ఉత్పత్తి ప్రారంభమైందన్నారు.అక్రమ మైనింగ్, ఖనిజాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18,000 ANPR కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్లు, ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు.మైన్స్ డైరెక్టర్ డబ్ల్యూ.బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో మైనింగ్ కార్యకలాపాలపై నిఘాను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారం, తనిఖీలు, అక్రమ మైనింగ్ నియంత్రణ, జిల్లా అధికారులతో సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, శ్రీనివాస చౌదరి, రవి చంద్, జిల్లా మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఆరు దశాబ్దాల ఎదురుచూపులకు తెర

- సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు
- 1,215 పేద కుటుంబాలకు ఊరట.
- ఆమోదం తెలిపిన క్యాబినెట్.
- నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ
- త్వరలో పట్టాల పంపిణీ పండుగ.
- కల సాకారం చేసిన సీఎం చంద్రబాబు,మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం.

**నెల్లూరు సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్**



ఆరు దశాబ్దాలుగా వెంటాడుతున్న భయం.. అనిశ్చితి.. కన్నీళ్లకు ఇక తెరపడనుంది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న నిర్వాసితుల 60 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కాలువకట్టపై సంబరాలు అంబరాన్నంటాయి.పట్టాలు ఇప్పిస్తానని నెల రోజుల క్రితం హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.సంకల్పం గట్టిదైతే సాధించలేనిది ఏదీ లేదని మరోసారి నిరూపించారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను సమన్వయపరిచి అధికారిక ప్రక్రియను వేగవంతం చేసి క్యాబినెట్ ఆమోదం సాధించారు. త్వరలోనే నిర్వాసితులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేయనున్నారు.

కాలువకట్టపై నివాసాలు తొలగిస్తారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ నిర్వాసితులు వణికిపోయేవారు. ఎప్పుడు తమ ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తుందోనన్న భయంతో నిద్రలేని రాత్రులు గడిపారు. సొంత ఇంట్లోనే హక్కు లేని పరిస్థితి..భవిష్యత్తుపై భరోసా లేని జీవితం..ఇలా ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి మారింది. గత నెల 8 వ తేదీన కాలువకట్టపై పర్యటించిన మంత్రి సమస్యను స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

పేదల ఇళ్లకు శాశ్వత భద్రత కల్పించడంలో మరో మైలురాయిని అధిగమించారు. తొలుత భగత్‌సింగ్ కాలనీలో 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి.. ఇప్పుడు సర్వేపల్లి కాలువకట్టపై మరో 1,215 కుటుంబాలకు పట్టాల మార్గం సుగమం చేశారు.రెండు ప్రాంతాల్లో కలిపి వేలాది కుటుంబాలకు శాశ్వత భరోసా కల్పించడం ద్వారా పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని స్థానికులు చెబుతున్నారు.

నాలుగు ప్రాంతాల్లో పండుగ వాతావరణం

క్యాబినెట్ ఆమోదం వార్త తెలియగానే లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు,స్టోన్ హౌస్ పేట ఉడ్‌హౌస్ సంగం, బాలాజీనగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్ ఎస్ఎస్ చికెన్ సెంటర్,శెట్టిగుంటరోడ్ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు.సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ ,డీసీఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేసి పూలవర్షం కురిపించారు.స్వీట్లు పంచిపెట్టారు. రంగులు చల్లుకుని,బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.దాంతో కాలువకట్ట ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.

60 ఏళ్లుగా మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఇళ్లు తొలగిస్తారన్న వార్త వచ్చిన ప్రతిసారీ భయంతో బతికాం. ఇప్పుడు మా పిల్లల భవిష్యత్తుకు భరోసా వచ్చింది. శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పి నెల రోజుల్లోనే హామీ నిలబెట్టుకున్న మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం" అంటూ నిర్వాసితులు భావోద్వేగానికి గురయ్యారు.పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని ఈ పరిణామం మరోసారి నిరూపించింది. సమస్యను గుర్తించడం నుంచి శాఖల సమన్వయం, క్యాబినెట్ ఆమోదం వరకు మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపారు.టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం" అని మరోసారి రుజువైందని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు.రెండు తరాల నిరీక్షణ తర్వాత సర్వేపల్లి కాలువకట్ట కథలో కొత్త అధ్యాయం మొదలైందంటున్నారు.ఆరు దశాబ్దాల నిరీక్షణకు తెరదించి, 1,215 కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.పాలాభిషేక కార్యక్రమంలో కాలువకట్ట నిర్వాసితులతో పాటు నగర మేయర్ దేవరకొండ సుజాత,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు,కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి,కిన్నెర మాల్యాద్రి,వెంకటేశ్వర రెడ్డి,టీడీపీ నాయకులు సాయిరాం,పెంచల చౌదరి,ఆంచూరు శ్రీనివాసులు,బీసీ బాబు,తిరుమల నాయుడు,కొండా ప్రవీణ్,అన్నపూర్ణ,ఇంతియాజ్ ,జహీర్,మొయినుద్దీన్ ,జనసేన నేత గుణుకుల కిషోర్ ,మార్కెటింగ్ కమిటీ మెంబెర్ గుణుకుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీకి చర్యలు

- 17 దరఖాస్తుల్లో 12 మందికి సర్టిఫికెట్లు అందజేత
- జాయింట్ కలెక్టర్‌కు గ్రామస్తుల ప్రత్యేక ధన్యవాదాలు

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, సెప్టెంబర్ 3:**




అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలోని బూరుగ, చిన్నకోనెల రెవెన్యూ గ్రామాలకు చెందిన 17 కుటుంబాలకు లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 17 కుటుంబాలు రొంపిల్లి సచివాలయంలో లేట్ డెత్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 12 కుటుంబాలకు సర్టిఫికెట్లు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సర్టిఫికెట్లు జారీ కాకపోవడంతో సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయడంతో పాటు ధర్నా నిర్వహించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ స్వయంగా గ్రామానికి చేరుకుని గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు.

జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, వీఆర్వో నాగేశ్వరరావు ద్వారా లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు 12 కుటుంబాలకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తుదారులకు కూడా త్వరితగతిన సర్టిఫికెట్లు అందించాలని వారు కోరారు. ఇప్పటికే 12 సర్టిఫికెట్లు జారీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ జాయింట్ కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన ఐదు దరఖాస్తులకు కూడా తక్షణమే లేట్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేయాలని గ్రామ పెద్దలు అధికారులను కోరారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సోముల అప్పలరాజు (మాజీ వార్డు సభ్యుడు), కోటపర్తి సింహాచలం, బూరుగ పెంటయ్య, బద్నాని శంకర్రావు తదితరులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పుట్టపర్తిని మోడల్ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
### జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల ఉన్నతస్థాయి సమీక్ష

**పుట్టపర్తి,సెప్టెంబర్,03:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, పుట్టపర్తి శాసనసభ్యురాలు మరియు మాజీ మంత్రివర్యులు లతో కలిసి పుట్టపర్తి పురపాలక సంఘ పరిధిలో మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణపై సమగ్ర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రాముఖ్యత పొందిన దృష్ట్యా, ఈ ప్రాంతాన్ని పరిశుభ్రమైన, ఆధునికమైన మోడల్ నగరంగా మార్చేందుకు స్పష్టమైన ప్రణాళికను ఖరారు చేశారు.పుట్టపర్తిని పూర్తిగా "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత", "స్టాగ్నెంట్ వాటర్ (నిల్వ నీరు) రహిత" మరియు "చెత్త రహిత పురపాలక సంఘంగా" తీర్చిదిద్దేందుకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ సిద్ధం చేశారు.ప్రతి ఇల్లు మరియు వాణిజ్య సముదాయాల నుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా 100% వేర్వేరుగా సేకరించాలి. దీని కోసం ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లు ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వర్షాకాలం దృష్ట్యా వెంటనే డ్రెయిన్లలో పూడికతీత పూర్తి చేయాలని, రహదారులపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేయాలని ఆదేశించారు. పట్టణంలో నిరంతరాయంగా ఫాగింగ్, దోమల నివారణ స్ప్రేయింగ్ చేపట్టాలి. వాణిజ్య ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండేలా "జంట చెత్తబుట్టల"ను ఏర్పాటు చేయాలి. అన్ని వార్డులకు సురక్షితమైన తాగునీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (STP) రోజువారీగా పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సూచించారు. పుట్టపర్తికి వచ్చే వేలాది మంది భక్తులు, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రాధాన్యమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికాకపోతే లేదా పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమములో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు,పబ్లిక్ హెల్త్ నరసింహ మూర్తి , మైన్స్ ఏడీ, మున్సిపల్ మరియు పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# దొంగ మాఫియాకు తగిన శాస్తి

**రాయదుర్గం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్**



:( డి.హిరేహాల్ ) మండల పరిధిలోని దొడగట్ట మట్టి మాఫియా దొంగలకు తగిన శాస్తి జరిగిందని భారత జాతీయ కాంగ్రెస్ రాయదుర్గం నియోజకవర్గం కన్వీనర్ గౌని ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ వారం రోజుల్లో విప్లవం రావడమంటే ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని అర్థం.

దొడగట్టలో దొంగలు పడ్డారు, చెరువును చెరపట్టారు. మట్టి మాఫియా ముదిరిపోయి కర్ణాటకకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాంటి వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పి నేను గత పది రోజుల క్రితం పిలుపునిస్తే, దొడగట్ట దొంగలే నాపై విరుచుకుపడుతూ రైతుల కోసం మట్టి తీసుకుంటున్నామని అపప్రచారం ఆపాలని ఒత్తిడి చేసి, ఇన్ ఫార్మర్ ని ఇబ్బంది పెట్టాలని చూశారు. పరిశీలించి చూస్తే దొడగట్టలో వారం రోజుల్లోనే విప్లవం స్టార్ట్ అయింది. నిన్నటి రోజున 60 నుండి 70 మందికి పైగా గ్రామస్తులు దొడగట్ట చెరువులో జరుగుతున్న దొంగతనాన్ని ఆపాలని మైనింగ్ మాఫియా వారిని మందలించి అక్కడ నుంచి వెళ్ళగొట్టడం జరిగినది. అందుకు దొడగట్ట గ్రామ ప్రజలందరికీ పేరు పేరునా నా కృతజ్ఞతాభివందనాలు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా జరుగుతున్న అవినీతి అరాచకాలకు అడ్డుకట్ట వేసే విధంగా ప్రజల్లో స్పందన రావాలని, వారు సొంతంగా స్పందించలేని పక్షంలో జిపిఆర్ హెల్ప్ లైన్ నెంబర్ అయిన 7386566233 నెంబర్ కి ఫోన్ చేసి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని రాయదుర్గం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ గౌని ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు.

# ‘ఇ.ఎం.ఐ’ కష్టాలు



ప్రతి మధ్యతరగతి ఇంట్లో ఇ.ఎం.ఐ కష్టాలు తప్పవు. ఈ క్రమంలోనే యువత ఇ.ఎం.ఐ కట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే కథాంశంతో రూపొందుతున్న చిత్రమే ‘ఇ.ఎం.ఐ’. ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న 7పి.ఎం.ప్రొడక్షన్స్ దీన్ని నిర్మిస్తుంది. నిఖిల్ కువ్వరపు దర్శకత్వం వహిస్తున్నారు. దరహాస్, శైలజ జంటగా నటిస్తున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి హీరో ఆది సాయికుమార్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు సాయి మార్తాండ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ స్క్రిప్ట్ అందజేశారు. త్వరలో ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

# భయానక ప్రపంచంలోకి అజయ్

‘భూత్’, ‘కాల్’, ‘షైతాన్’ లాంటి చిత్రాలతో హారర్ ప్రియుల్ని అలరించారు బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్. ఇప్పుడాయన మళ్లీ హారర్ జానర్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. అజయ్ ప్రధాన పాత్రలో రోహిత్ జుగ్రాజ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. చిత్రీకరణను మొదలు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు అజయ్. “భయానక ప్రపంచంలోకి వచ్చేశాం. సీటు అంచున కూర్చోబెట్టే ఈ హారర్ థ్రిల్లర్ కోసం వేచి ఉండండి” అనే వ్యాఖ్యల్ని జోడించారు. దీన్ని దేవగణ్ ఫిల్మ్స్, పనోరమా స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి ‘గృహ ప్రవేశ్’ అనే పేరు పరిశీలనలో ఉందని, గరుడ పురాణం ప్రేరణతో దీన్ని తీర్చిదిద్దుతున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగు తున్నాయి.

# ఆ చిత్రానికి నేనే దర్శకత్వం వహిస్తా!

ఆరు నుంచి... అరవయ్యేళ్ల వయసున్న ప్రేక్షకుల వరకూ అందరికీ నచ్చేలా మా ‘రోమాంచకం’ ఉంటుందన్నారు సుమంత్ ప్రభాస్. ఆయన కథానాయకుడిగా... ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో రూపొందిన సినిమానే ఇది. వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. గురువారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ...



“కుటుంబంతో కలిసి చూసినా, స్నేహితులతో కలిసి చూసినా హాయిగా నవ్వుకుంటూ ఆస్వాదించే సినిమాలు కొన్ని ఉంటాయి. అలాంటి సినిమానే ‘రోమాంచకం’. హైదరాబాద్ కుర్రాడి కథ. డిగ్రీ పూర్తయ్యాక స్టార్టప్ కంపెనీని మొదలుపెట్టే ఆలోచనలో ఉన్న ఓ యువకుడి కథతోనే ఈ చిత్రం రూపొందింది. సినిమా పూర్తయ్యాక సందీప్ అన్న చూశారు. ‘అమాయకత్వం, ఆవేశం, ఉత్కంఠ ప్రదర్శిస్తూనే ఓ హీరోలా తెరపై కనిపించడం అంటే మాటలు కాదు. చాలా బాగా చేశావు’ అని మెచ్చుకున్నారు. ఇప్పటివరకూ నాకు దక్కిన అత్యుత్తమ ప్రశంస అది. మొన్న వేదికపై కూడా అదే మాట చెప్పారు. కథానాయకుడు ప్రభాస్‌కి నేను ఫ్యాన్‌బాయ్‌ని. అందుకే నా పేరుకి ఆయన పేరుని జోడించుకున్నా. నిన్ననే ప్రభాస్ అన్నని కలిశాం. వాళ్లింటికి వెళితే ఆయన ఎలా ఆతిథ్యం ఇస్తారో అందరికీ తెలుసు. ఆ అంచనాల్ని మించి ఆయన మమ్మల్ని చూసుకున్నారు. ఒక్కసారిగా నా ప్రయాణమంతా గుర్తొచ్చింది, కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఈమధ్యే నన్ను దృష్టిలో ఉంచుకునే నేనొక కథ రాశా. అది ఎప్పుడు చేయాలా అని ఆలోచిస్తున్నా. ఆ చిత్రానికి నేనే దర్శకత్వం వహిస్తా. ప్రస్తుతం ‘రాజు వెడ్స్ రాంబాయి’ ఫేం సాయిలు కంపాటి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఈ నెలలోనే చిత్రీకరణ మొదలవుతుంది” అన్నారు.

# ‘హనుమాన్ అంశ్’.. మాజీ క్రికెటర్ సెహ్వాగ్ ఎమోషనల్ పోస్ట్..!




ఎలాంటి స్టార్స్ లేకుండా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న తాజా చిత్రం ‘హనుమాన్ అంశ్’. ఇటీవల హిందీలో విడుదలైన ఈ మూవీ కేవలం మౌత్ టాక్‌తోనే రూ.70 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, హనుమాన్ భక్తుడు నీమ్ కరోలి బాబా(మహరాజ్‌జీ) జీవితం, ఆయన బోధనల ఆధారంగా ఈ సినిమాను విశాల్ చతుర్వేది తెరకెక్కించారు. తాజాగా ఈ మూవీ చూసిన టీమ్ ఇండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఈ మూవీ మహరాజ్‌కు భక్తిపూర్వక వందన సమర్పణ అని కొనియాడారు.

“కొన్ని అనుభూతులు, కొందరు వ్యక్తులను వర్ణించడానికి మాటలు సరిపోవు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. నా స్నేహితుల్లో కొందరు నీమ్ కరోలి బాబాకు భక్తులుగా ఉన్నారు. పదేళ్ల కిందట ఆయన గురించి నాకు చెప్పారు. అప్పటి నుంచి ఆయన గురించి వింటూ, చదువుతున్నా. మహరాజ్ జీ వ్యక్తిత్వం, ఆయన భక్తి, నన్నెంతో ఆకర్షించాయి. ఆయన ఆశీస్సులు ఎంతో మంది జీవితాలు మార్చేశాయి. కొద్ది రోజుల కిందట ఆయన జీవిత కథ ఆధారంగా రూపొందిన ‘హనుమాన్ అంశ్’ చూశా. ఆయన జీవితాన్ని ఒకే ఒక సినిమాలో చూపించడం అసాధ్యం. అయినా కూడా దీనిని చాలా అద్భుతంగా, అందంగా చూపించారు. మహరాజ్‌జీకి ఇది నిజమైన వందనం. సినిమాలో ఆయన చుట్టూ పాములు ఉన్న సన్నివేశం నన్నెంతో కదిలించింది. ఆయన భక్తులలో ఒకరు, ‘మీరు శివుడిలా అమాయకులు’ అని అంటారు. అందుకు ఆయన బదులిస్తూ ‘అమాయకులు మీరే. మన హృదయాల్లో ఉన్నదాన్నే కళ్లు చూస్తాయి’ అని అంటారు. బహుశా ఆయన మనందరికీ చెప్పాలనుకున్నది ఇదేనేమో. మన దేశ చరిత్రలో ఇలాంటి సాధువులు అరుదుగా జన్మిస్తారు. ఆయనను అర్థం చేసుకోవడం అసాధ్యం, కానీ ఆయనను ఒక్కసారి చూడటం సాధ్యమే. మీకు ఆయన గురించి తెలిస్తే, ఈ సినిమా చూడండి.. ఒకవేళ ఆయన గురించి వినకపోతే, తప్పకుండా చూడండి” అని సెహ్వాగ్ అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధం...

ఇప్పుడు ఈ మూవీ ప్రపంచ ప్రేక్షకులకు అందించడానికి హోంబలే ఫిల్మ్స్ ముందుకు వచ్చింది. సెప్టెంబరు 11వ తేదీన ఈ సినిమాని ఓవర్సీస్‌లోనూ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ‘కేజీయఫ్’, ‘కాంతార’ వంటి చిత్రాలను ప్రేక్షకులకు అందించిన హోంబలే ఫిల్మ్స్ ఇప్పుడు చిన్న మూవీ ‘హనుమాన్ అంశ్’ను ప్రోత్సహించడం గమనార్హం. ‘విశ్వాసంతో కూడిన కథ. సరిహద్దులు దాటి ప్రయాణం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం ఈ సినిమాను అందుబాటులోకి తెస్తున్నాం. మహరాజ్ జీ ఆధ్యాత్మిక ప్రయాణం సెప్టెంబరు 11న విడుదల కానుంది” అని పేర్కొంది.

# ఘోరంగా ఓడింది గాక.. తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు!




ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్‌జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డు సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ మండిపడ్డారు. అయితే, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ మాత్రం తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకుంటున్నాడు. అదే సమయంలో జట్టు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న టీమ్‌ల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు.

“మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. ఇటీవల కాలంలో చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతటితో అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా? మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. ఎవరైనా రాణించకపోతే లేదా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోతే మేమేం చేయగలం? మాకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ఎంతో ముఖ్యం. కచ్చితంగా టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన దానిని తప్పుగా పరిగణించలేం. మేం ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాం. కానీ, దేవుని దయతో వన్డేలు, టీ20ల్లో మాదిరిగానే రాబోయే రోజుల్లో టెస్టుల్లో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా. నేను విమర్శలకు ఎప్పుడూ భయపడలేదు, ఇకపై కూడా భయపడను.

నేను పీసీబీ చీఫ్‌గా వచ్చినప్పటి నుంచి క్రికెట్ నాశనమైందని అనేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మేం ఈ కోచింగ్ బృందాన్ని తీసుకురాకముందు జట్టు ర్యాంకింగ్స్ ఎలా ఉండేవో చూడండి. వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చాం” అని మోసిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం ముక్కోణపు టీ20 సిరీస్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాకు చుక్కెదురైంది. ఈ ఫలితాలను ఉద్దేశించే మోసిన్ నఖ్వీ తాజాగా ఈ తరహా వ్యాఖ్యలు చేశాడని, పీసీబీ చీఫ్ జట్టును సరైన దారిలో నడిపించకుండా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నడిపించిన నాయకుడు

టీ20 క్రికెట్లో ఇప్పటికే తనేంటో రుజువు చేసుకున్న హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ.. ఇప్పుడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్లోనూ సత్తా చాటుకున్నాడు. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో రెండు ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టిన సౌత్ జోన్ కెప్టెన్.. తన జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. బుధవారం ముగిసిన మ్యాచ్‌లో సౌత్ 7 వికెట్ల తేడాతో నార్త్ జోన్‌పై విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు చేసిన తిలక్ వర్మ రెండో ఇన్నింగ్స్‌లో విలువైన అర్ధశతకం (51 నాటౌట్; 79 బంతుల్లో 8×4) సాధించడంతో సౌత్.. 181 పరుగుల లక్ష్యాన్ని 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 43.1 ఓవర్లలో ఛేదించింది. అభేద్యమైన నాలుగో వికెట్‌కు రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో తిలక్ 80 పరుగులు జోడించాడు. ఓపెనర్లు రికీ భుయ్ (42), నారాయణ్ జగదీశన్ (43) కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. నార్త్ బౌలర్లలో అబిద్ ముస్తాక్ (2/55) ఆకట్టుకున్నాడు. అంతకుముందు 256/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన నార్త్.. 297 పరుగులకు ఆలౌటైంది. చివరి ముగ్గురూ బ్యాటర్లను నిధీశ్ (5/56) బౌల్డ్ చేసి ప్రత్యర్థి కథ ముగించాడు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ 195 పరుగులకే ఆలౌట్ కాగా.. సౌత్ 312 పరుగులు చేసింది. తిలక్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా ఎంపికయ్యాడు. సౌత్, ఈస్ట్ జోన్ల మధ్య దులీప్ ట్రోఫీ ఫైనల్ ఆదివారం మొదలవుతుంది.



‘టెస్టు’ అంటే ఎంతో ఇష్టం

టెస్టు క్రికెట్ అంటే తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టమని టీమ్‌ఇండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. కెప్టెన్ ఇన్నింగ్స్‌లతో సౌత్ జట్టును దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేర్చిన నేపథ్యంలో తిలక్ మాట్లాడుతూ.. “ఎర్ర బంతి క్రికెట్ ఆడడాన్ని ఎప్పుడూ ఆస్వాదిస్తా. భారత జట్టుకు పరిమిత ఓవర్ల క్రికెట్లో ప్రాతినిధ్యం వహిస్తానని ఎప్పుడూ కలగనలేదు. అది దేవుడి ప్రణాళిక. నేను ఐపీఎల్ వల్ల టీ20లు, వన్డేల్లో భారత్‌కు ఆడగలిగాను. కానీ నా బలం ఎర్ర బంతి క్రికెట్టే. పదేళ్ల వయసు నుంచి ఆ ఫార్మాట్లో రాణించేందుకు కష్టపడ్డాను. టెస్టులు నాకెంతో ఇష్టమైన ఫార్మాట్. అంతర్జాతీయ షెడ్యూల్ వల్ల మూణ్నాలుగేళ్లుగా నేను రంజీ ట్రోఫీలో ఆడదామన్నా ఎక్కువ కుదరట్లేదు. సుదీర్ఘ ఫార్మాట్లో ఇలాగే రాణించి.. భారత టెస్టు జట్టులోకి రావాలనుకుంటున్నా” అని చెప్పాడు.

# భారత్ పాక్ పోరును చూసే తీరు ఇకనైనా మారాలి

భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే హైటెన్షన్. తమ జట్టే గెలవాలని ఆయా దేశాల అభిమానులు బలంగా కోరుకుంటారు. అయితే, ఈ విధానం మారాల్సిన అవసరం ఉందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ అన్నాడు. అలాగే, భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్‌తో తనకున్న పరిచయంపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పఠాన్‌ను తొలిసారి 2004 ఆస్ట్రేలియా పర్యటన సమయంలో కలిసినట్లు గుర్తు చేసుకున్నాడు



“2004లో ఇర్ఫాన్ పఠాన్ తొలిసారి ఆస్ట్రేలియా పర్యటనలో కలిశాడు. అప్పుడు నేను ఈఎస్‌పీఎన్ స్టార్‌కు వ్యాఖ్యాతగా ఉన్నా. అతడు నాకు పెద్ద ఫ్యాన్. మా ఆటను చూస్తూ పెరిగాడు. ఆ సిరీస్ సందర్భంగా అప్పుడు కొన్ని సలహాలు ఇచ్చా. కెరీర్ ఆరంభం నుంచే ఇర్ఫాన్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. మొదట్లో నా బౌలింగ్ శైలిలానే ఉండేది. కుర్రాళ్లు మమ్మల్ని ఏదైనా సలహా అడిగినప్పుడు ప్రధానంగా మైండ్‌సెట్ గురించే చెబుతాం. మణికట్టు పొజిషన్, ప్రత్యర్థి బ్యాటర్‌ను ఎలా అంచనా వేయాలనే అంశాలపై మాట్లాడతాం. ఇర్ఫాన్ మంచి కుర్రాడే. ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం. అయితే, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తరచూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూనే ఉంటాడు. మా అభిమానులు కూడా అందుకు సిద్ధంగానే ఉంటారు. అలాంటి వాటికి సమాధానం ఇస్తుంటారు” అని అక్రమ్ తెలిపాడు.

అతీతంగా వెళ్లొద్దు..

“భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు విపరీతమైన హైప్ తీసుకొస్తారు. క్రికెట్‌ను ఓ ఆటగానే చూడాలని కోరతా. అందుకు అతీతంగా వెళ్లొద్దని చెబుతా. ప్రజలకు చాలా ఖాళీ సమయం ఉన్నట్లుంది. వారు ఎందుకు అర్థం చేసుకోవడం లేదో? ఇది కేవలం ఒక మ్యాచ్ మాత్రమే. చివరికి ఎవరో ఒకరు గెలవాలి. మరొకరు ఓడిపోవాలి. తర్వాత మ్యాచ్ కోసం సన్నద్ధమవ్వాలి. ఎప్పుడో 1970ల నుంచి ప్రతీకారం అంటూ ఇప్పటికీ అలానే ఆలోచించడం సరికాదు. ఖాళీగా ఉండే మనసు చెడు ఆలోచనలకు నిలయం అన్నట్లుగా కొందరి పరిస్థితి ఉంది. దాన్నుంచి బయటపడాలి” అని అక్రమ్ వ్యాఖ్యానించాడు..

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314